RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 1 ఆగస్ట్ 2025 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:52

# పాదయాత్ర అంటేనే కాంగ్రెస్ మహేష్ కుమార్ గౌడ్

## 18 నెలలలో మేము చేయాల్సిన పనులు అన్ని చేశాము చేస్తున్నాము..మీనాక్షి నటరాజన్









**పరిగి ప్రజాబలం ప్రతినిధి:**తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు( ఎమ్మెల్సీ) మహేష్ కుమార్ గౌడ్ జనహిత పాదయాత్రకు అపూర్వస్పందన

పాదయాత్రకు పోటెత్తిన జనసందోహం

టీపిసిసి చీఫ్, ఏఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కి అడుగడుగున బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

జనసందోహంతో కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు

పరిగి టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రోలింగ్ మాట్లాడుతూ

ప్రభుత్వంలో ఉన్నారు కదా పాదయాత్ర ఎందుకని అంటున్నారు?

పాదయాత్ర అంటేనే కాంగ్రెస్

భారత్ జోడో పాదయాత్రతో భౌగోళికంగా సామాజికంగా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకున్నారు

ఏఐసీసీ ఆదేశాల మేరకు జనహిత పాదయాత్ర

పాదయాత్ర తో ఇప్పుడు ప్రభుత్వం అందించే సంక్షేమం పథకాల తో పాటు ప్రజలకు ఇంకా ఏమి కావాలో తెలుసుకోవడానికే పాదయాత్ర

కాంగ్రెస్ పార్టీ మాటిస్తే కట్టుబడి పనిచేస్తుంది

కేసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తే.. వడ్డీలు కడుతూ సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తున్నాం

తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్ష 80 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 65 వేల ఉద్యోగాలు ఇచ్చాం..ఇంకా 35 వేల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం

కుటుంబ పాలన అంతమొందించాలని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారు

సీఎం రేవంత్ తో పాటు మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటున్నారు

దేశానికి దశ దిశ రాహుల్ గాంధీ గారు

నిస్వార్థంతో దేశాన్ని ముందుకు తీసుకోవాలని రాహుల్ గాంధీ తపన

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్ట బద్దత కోసం మద్దతు ఇవ్వమంటే బీజేపీ నేతలు మొఖం చాటేస్తున్నారు

బీసీ రిజర్వేషన్ల కోసం ఆగస్టు 5,6,7 వ తేదీలలో ఢిల్లీకి మాతో కలసి రావాలని బీజేపీ నేతలను విజ్ఞప్తి చేస్తున్నా

రిజర్వేషన్లకు కవితకు ఏం సంబంధం?

కవిత వైఖరి చూస్తుంటే నవ్వొస్తుంది

ఎస్సీ వర్గీకరణ చేయాలంటే ఎంత దమ్ముండాలి

ఎస్సీ వర్గీకరణ కోసం రెండు వర్గాలను ఒప్పించడం ఆషామాషీ కాదు

సోనియా గాంధీ మాటిచ్చారు కాబట్టే తెలంగాణ వచ్చింది. ఖర్గే, రాహుల్ గాంధీ మాటిచ్చారు కాబట్టే ఆరు గ్యారెంటీల అమలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుంది

పరిగి జనహిత పాదయాత్ర లో ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ

రాహుల్ గాంధీ ప్రజలను కలవడానికి ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి పాదయాత్ర చేశారు.

మీ ఆశీర్వాదం తో రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే పేదలకు సన్న బియ్యం,మహిళలకు ఫ్రీ బస్ అందిస్తుంది.

పూలే, అంబేద్కర్ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని రాహుల్ గాంధీ పాదయాత్ర లో చెప్పారు..

బిసి రిజర్వేషన్ల కోసం డిల్లీ లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నాము ప్రతి ఒక్కరు డిల్లీ కి రావాలి.

18 నెలలలో మేము చేయాల్సిన పనులు అన్ని చేశాము చేస్తున్నాము..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దారులను గెలిపించండి..ఈకార్యక్రమంలో గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంనుండి ఓబీసీ కో ఆర్డినేటర్ నిర్మల్ కూమార్ యాదవ్ ,సంజయ్‌కూమార్ యాదవ్ , చందు ,ముత్యాలు ,వేణు తదితరులు పాల్గోన్నారు.

## మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై పిటిషన్ , సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్పై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దీనిపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సీజే బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణలో 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ తరపున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్ని బీఆర్ఎస్ కోరింది. తరువాత, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు అయిన విషయం తెలిసిందే. సదరు పిటిషన్లపై విచారణ జరిపి ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది సర్వోన్నత న్యాయస్థానం. తాజాగా గురువారం నాడు తీర్పు ఇచ్చింది. ధర్మాసనంలో సీజేఐతోపాటు జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ వున్నారు.

పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, జి జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసారు.

ఈ ఏడాది జనవరి 15న పిటిషన్లు దాఖలు కాగా, సుప్రీంకోర్టులో తొమ్మిది సార్లు విచారణకు వచ్చాయి.

# ఆగస్టు 2న అందోల్ లో నిర్వహించే శ్రమదానం కార్యక్రమం ఏర్పాట్ల సమీక్ష

### అందోల్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం

### నిర్వహించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూలై 31 ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గం లో, ఆగస్టు 1 2 తేదీలలో , (ఏఐసీసీ ) తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్, మీనాక్షి నటరాజన్, పర్యటనను విజయవంతం చేయటంపై, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు( ఏఐసీసీ ) తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి, మీనాక్షి నటరాజన్, పర్యటనలో భాగంగా, చేపట్టనున్న పాదయాత్రలో పాల్గొనేందుకు, పెద్ద ఎత్తున తరలివస్తున్న కార్యకర్తలకు అవసరమైన ఏర్పాట్ల ను మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు, అందోల్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంను



పరిశీలించారు, మీనాక్షి నటరాజన్ పర్యటనలో, ఆగస్టు 2 న, అందోల్ పట్టణంలో నిర్వహించే, శ్రమదానం కార్యక్రమం, ఏర్పాట్లు కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం ఏర్పాట్లపై ముఖ్య నాయకులతో చర్చించారు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాటు చేయాలని, మంత్రి ముఖ్య నాయకులను కోరారు, ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, ముఖ్య నాయకులు సురేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త, జగన్ మోహన్ రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు, డాకూర్ మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య,నరేందర్ రెడ్డి, మాజీ కావున్సిల్లరు చిట్టి బాబు, సత్యనారాయణ, శంకర్, యువ నాయకులు, పృథ్వీ రెడ్డి,వినయ్ గౌడ్, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# తెలంగాణ క్రీడా రంగానికి మంచి భవిష్యత్తు

### నూతన క్రీడా విధానంతో మారనున్న క్రీడారంగ ముఖచిత్రం

### సీఎం రేవంత్ ఆలోచనల ప్రతిరూపమే నూతన క్రీడా విధానం

### రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి





**వనపర్తి ప్రజాబలం ప్రతినిధి:**సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

గురువారంనాడు వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంప్లెవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగము సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు.

తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటము ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు.

దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు

అందజేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ బాధ్యతలు మరింత విస్తరించబోతున్నాయని

వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన వివరించారు.



ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధుల తో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

క్రీడా విధానం2025 తెలంగాణ క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును

ఒక ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరపున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని,

రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

ప్రజాబలం

1 ఆగస్ట్ 2025 శుక్రవారం

# చరిత్రను తిరగరాసిన దివ్య

ప్రతి తరానికీ ఒక చరిత్ర ఉంటుంది. కొన్ని చరిత్రలు కాలగతిలో మిగిలిపోతాయి, మరికొన్ని తరతరాలకూ మార్గదర్శకంగా నిలుస్తాయి. 2025 జులై నెలలో 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ సాధించిన విజయం భారత చెస్ చరిత్రను తిరగరాసింది. ఫిడే మహిళల ప్రపంచ కప్‌ను గెలిచి, ఆమె కేవలం క్రీడాకారిణిగా కాకుండా, భారత మహిళా చెస్‌కు ఓ కొత్త శకాన్ని లిఖించిన నేతగా నిలిచారు. ఈ విజయం కేవలం ఒక స్పోర్ట్ టైటిల్ కాదు. ఇది ఒక దేశం పట్ల, ఒక కల పట్ల, తనపై ఉన్న విశ్వాసం పట్ల ఇచ్చిన సమాధానం. దివ్య దేశ్‌ముఖ్ కథ ఒక వ్యక్తిగత గాథ కాదు. ఇది లక్షలాది యువతిలో వెలిగే ఆశకు రూపం. చెస్ గేమ్ మౌనంగా సాగుతుంది. ఆ బోర్డు మీద శబ్దం ఉండదు. కానీ ఆ మౌనంలో మారుతున్న గేమ్ ప్లాన్‌లు, మెదడు చురుకుదనం అంతటా కొట్టిపడతాయి. దివ్య దేశ్‌ముఖ్ గెలుపు కూడా అలాంటిదే. బయటకు మామూలుగా అనిపించొచ్చు. కానీ ఆమె చేసినది ఒక బలమైన, అద్భుతమైన ప్రయత్నం. తన ప్రత్యర్థి, భారత చెస్ చరిత్రలో అత్యున్నత స్థాయిలో ఉన్న గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి. అంతటి అనుభవాన్ని, స్థిరతను ఎదుర్కొని, పలు రౌండ్ల తర్వాత ఫైనల్లో టై-బ్రేక్ గేమ్‌లో గెలిచి, దివ్య ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంది. ఇది మామూలు విజయం కాదు. ఇది ఒక తిరుగుబాటు.

వయస్సుతో సంబంధం లేకుండా పట్టుదల ఎంత బలంగా ఉంటుందో నిరూపించిన ఘట్టం. పిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో పేరు పొందడం ఎవరికైనా సాధ్యపడదు. దివ్య దేశ్‌ముఖ్ కథలో గణాంకాలు ఎంతో చెప్పగలవు. 7 ఏళ్ల వయసులో ఫిడే రేటింగ్ ప్రారంభం, 13 ఏట వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్, 15 ఏట వుమెన్ గ్రాండ్ మాస్టర్, 2025లో ప్రపంచ కప్ విజయం, గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధన. కానీ ఈ గణాంకాల వెనుక ఉన్న కన్నీళ్లు, కడుపు మంట, కలపై ఉన్న నమ్మకం చెప్పడానికి సంఖ్యలు చాలవు. ఆమె కథ మధ్యతరగతి కుటుంబాల్లో పుట్టే ప్రతీ సాధారణ పిల్లవాడి కథ. పాఠశాల ముగిసిన వెంటనే చెస్ బోర్డు ముందు గంటల తరబడి కూర్చునే జీవితం. ఓటమి అన్నప్పుడు కన్నీళ్లు తడిపే గడ్డ. విజయం దగ్గర లోపాలు కనిపించి మరింతగా శ్రమించాల్సిన స్థితి. తల్లిదండ్రుల త్యాగం - ఆర్థికంగా, మానసికంగా ఇవన్నీ కలిసే గమ్యం సాధ్యమైంది. చెస్ బోర్డు మీద ఆమె వేసిన ఒక్కో ఎత్తుగడ ఆమె అంతర్గత విశ్లేషణకు, వ్యూహం బలానికి నిదర్శనాలు. ఫైనల్లో ప్రత్యర్థి ఒక దిగ్గజం అయినా, దివ్య భయపడలేదు. ఆమె ఆటలో దూకుడు ఉన్నా, ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపించింది. సూటిగా, ఒత్తిడిని అవకాశంగా మలచుకునే తత్వాన్ని చూసినప్పుడు ఆమె గురువు శ్రీనాథ్ ఎందుకు 'ధోనీ తరహా క్లచ్ ప్లేయర్' అన్నారో అర్థమవుతుంది. ఈ ఒక్క గెలుపు చెస్ బోర్డు వరకు పరిమితం కాదు. ఇది భారత మహిళా క్రీడాకారిణుల అభివృద్ధికి ఉదాహరణగా, తరతరాల ఆశలలో సరికొత్త పుటగా, సామాజిక అడ్డంకులను చెరిపేసే నిదర్శనంగా మారుతుంది.

భారతదేశంలో చెస్‌కు ప్రాచీన చరిత్ర ఉంది. కానీ మహిళల రంగం లో ఒక పరిమిత స్థాయివరకు మాత్రమే విజయాలు నమోదయ్యాయి. కోనేరు హంపి, హారిక ద్రోణవల్లి వంటి పేర్లు ఒక తరం ఆకర్షణగా నిలిచినా, ఇప్పుడు దివ్య దేశ్‌ముఖ్ వంటి యువతరపు ప్రతిభ కొత్త శక్తిగా మారుతోంది. ఇది సామర్థ్యాన్ని గుర్తించే సమాజానికి సంకేతం. ఈ గెలుపు ద్వారా మాత్రమే కాకుండా, దివ్య చూపించిన క్రమశిక్షణ, ఒత్తిడిని ఎదుర్కొనే తత్వం, టెక్నికల్ లోతు -ఇవన్నీ ఇప్పుడు భారత మహిళల చెస్‌కు ఒక కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇస్తున్నాయి. ఇది వ్యక్తిగత గెలుపును సామూహిక విజయంగా మార్చే అవకాశం. ఇలాంటి అద్భుత గెలుపును ప్రభుత్వాలు, కార్పొరేట్ రంగాలు మరింత శ్రద్ధగా పరిశీలించాల్సిన సందర్భాలు. ఒక యువతి అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను గర్వించేలా చేయగలగడం అంటే, అది వ్యక్తిగత ప్రతిభ మాత్రమే కాదు. మరింత మంది దివ్యల కోసం ప్రణాళికలు, పెట్టుబడులు, శిక్షణ కేంద్రాలు, స్పాన్సర్ షిప్‌లు ఇప్పుడే మొదలుకావాలి. దివ్య దేశ్‌ముఖ్ విజయం ఆటలోనే కాదు, క్రీడా మౌలిక వసతులలో పెట్టుబడి పెంచాల్సిన అవసరాన్ని గుర్తు చేసే ఘట్టం. దివ్య దేశ్‌ముఖ్ గెలుపు మనం గర్వపడాల్సిన విషయం మాత్రమే కాదు. మనం ఆలోచించాల్సిన విజయం. ఏ సాధనా వృథా కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పట్టుదల ఉంటే అసాధ్యం అనే మాటే ఉండదని ఆమె నిరూపించారు. ఆమె విజయగాథ తెల్లబోర్డుపై నల్లపావులతో నడిచిన తత్వజ్ఞాన పాఠం. అటువంటి ప్రేరణలు ఒక్కొక్కసారి దేశం దిశను మారుస్తాయి. మన కళ్ల ముందే మారుతున్న భారత చెస్ చరిత్రలో, దివ్య దేశ్‌ముఖ్ పేరు ప్రేరణ పుస్తకాల్లో తప్పకుండా ఉంటుంది.

# హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌కు మంత్రి శ్రీధర్ బాబు ఆత్మీయ వీడ్కోలు




హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ - అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం, దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ తెలంగాణ - అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాక్షించారు.

# స్వరాజ్యం నా జన్మహక్కు..దాన్ని నేను పొంది తీరుతాను అని గర్జించిన ధీరుడు బాలగంగాధర తిలక్

## -నేడు అయిన వర్ధంతి



స్వరాజ్యం నా జన్మహక్కు..దాన్ని నేను పొంది తీరుతాను అని స్వాతంత్ర పోరాటంలో గర్జించిన ధీరుడు లోకమాన్య బాలగంగాధరతిలక్. దేశవ్యాప్తంగా సామాన్యప్రజల్ని భారతజాతీయోద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో బాలగంగాధర తిలక్ సఫలీకృతుడయ్యారు. అందుకే ఆయనను భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూలకారకుడు గా భావిస్తారు. అతను జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించడం తో ఆయనను భారతజాతీయోద్యమ పితగా పేర్కొంటారు. ఇతనికి లోకమాన్య అనే బిరుదు కూడా ఉంది. మహాత్మా గాంధీ అతన్ని "ఆధునిక భారతదేశపు మేకర్" అని పిలిచారు. బాలగంగాధరతిలక్ 1856 జులై 23వ తేదీన మహారాష్ట్ర లోని రత్నగిరిలో జన్మించాడు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు. తల్లి పార్వతీ బాయి ఆధ్యాత్మిక సంపన్నురాలు, బాల్యం లో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణితశాస్త్రంలో ఆయన విశేష ప్రతిభ కనబరచేవాడు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటితనం ఆయనకు సహజం.

కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్యనభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకడు. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు ఆయన తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకువచ్చింది. పుణె ఆంగ్లోవెర్నాకులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్యసించాడు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే ఆయన తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయాడు. మెట్రిక్యులేషన్ చదువుతున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక దక్కన్ కళాశాలలో చేరాడు. 1877లో తిలక్ గణితశాస్త్రంలో ప్రథమశ్రేణిలో పట్టభద్రుడయ్యాడు. ఆ తర్వాత తనచదువును కొనసాగించి ఎల్.ఎల్.బి. పట్టా కూడా పొందాడు తిలక్. 1890లో కాంగ్రెస్ లో సభ్యుడుగా చేరాడు. కానీ త్వరలోనే తిలక్ కు కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని నమ్మాడు. అప్పటివరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరివారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాలను "ప్రార్థించు, వినతి, నిరసన" చెయ్యడానికే పరిమితమైంది. తిలక్ దాని గురించి చాలా ఘాటైన విమర్శలు చేశాడు. "మీరు సంవత్సరానికొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్స్టిట్యూషన్)" అన్నాడు. కాంగ్రెస్ సమావేశాలను 3-దే తమాషాగా అభివర్ణించాడు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని గర్జించాడు.""1907లో మహారాష్ట్రలోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోయింది. మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టుకున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్ మద్దతుదారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటయారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్యవిద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిచాడు - అది భారతీయ సాంస్కృతికవారసత్వాన్ని అగౌరవపరచి భారతీయ విద్యార్థులను చిన్నబుచ్చేవిధంగా ఉందని. ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం బాలగంగాధరతిలక్ ది. భారతీయులకు భారతీయ సంస్కృతి గురించి, భారతదేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అందుకే అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ని స్థాపించాడు. ఆ తర్వాత తాను నడిపిన పత్రికలు మరాఠా(ఆంగ్ల పత్రిక), కేసరి(మరాఠీ పత్రిక) లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశాడు. బాల్యవివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించాడు. జాతీయస్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలిపెట్టలేదు. మొట్టమొదటిసారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం తిలక్ మొదలుపెట్టాడు. పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో తిలక్ కు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదలయ్యాక స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

1906లో దేశద్రోహం నేరం క్రింద ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే గీతారహస్యం అనే పుస్తకం రాశాడు, చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని అభిప్రాయం. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్ను స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్యభారతదేశంలో గ్రామగ్రామానా తిరిగాడు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్నివ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించాడు. బాధ్యతాయుత ప్రభుత్వమంటే ఎవరికి బాధ్యత వహించే ప్రభుత్వమో, అధిక ప్రాధాన్యమంటే ఎంత ప్రాధాన్యమో, అసలు అది ఎప్పుడిస్తారో ఏదీ స్పష్టంగా లేదు. కానీ బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేసి ప్రభుత్వానికి తన మద్దతు ప్రకటించింది. అలా ఇద్దరు నాయకులదీ చెరొకదారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడిపోయింది.

కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. 1920 ఆగస్టు 1వ తేదీన బొంబాయిలో 64 ఏళ్ల వయసులో బాలగంగాధర్ తిలక్ స్వర్గస్తులయ్యారు

# దేవాలయాలకు పూర్వ వైభవం

పుట్టపర్తి శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కార్యక్రమాల్లో మాధవ్ పాల్గొన్నారు. చైతన్య హోటల్ లో సంఘ్ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగ కార్యక్రమంలో మాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల టీ స్టాల్ ఎదురుగా బిజెపి నేతలతో కలిసి పివీఎన్ మాధవ్ మేధావులు, స్థానికులు కార్యకర్తలతో కలిసి చాయ్ పే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై చర్చించారు. పలువురు స్థానికులు స్థానికంగా ఉన్న సమస్యలను మాధవ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో సత్యసాయిబాబా చేసిన సేవలు అమోఘమని ఆయన కొనియాడారు. ఆయన మహిమలు ఆయన చేసిన సేవలతోనే అనంతపురం తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పుట్టపర్తికి ఒక గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. పుట్టపర్తిని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తామన్నారు. ఆయనతో పాటు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు శేఖర్, కదిరి మాజీ ఎమ్మెల్యే మిట్టాపార్థసారథి , బిజెపి నేతలు పాల్గొన్నారు.

# సింహాద్రిలో వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో గురువరం నాడు శాస్త్రోక్తముగా శ్రీ స్వామివారికి 108 బంగారు పుష్పాలతో అత్యంత వైభవంగా స్వర్ణ పుష్పార్చన స్వర్ణ పుష్పార్చన లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణపుష్పార్చన అత్యంత వైభవంగా జరిగింది సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంక రించి ఆలయ కల్యాణ మండ పములో వేదికపై అధిష్ఠింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన సేవ వైభవంగా నిర్వహించారు ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

# విస్తృత వ్యాధిగా ఊపిరితిత్తుల క్యాన్సర్

క్యాన్సర్ వ్యాధి అంటేనే భయపడతాం. క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స పద్ధతులు లేవవి కంపించి పోతాం. క్యాన్సర్ వ్యాధుల్లో విస్తృతమైనదిగానే కాకుండా ప్రాణాంతకమైనదిగా ఊపిరితిత్తుల లేదా లంగ్ క్యాన్సర్‌ను గుర్తించారు. తొలుత వ్యాధి లక్షణాలు కనుపించకపోవడంతో అంతిమ దశలో నిర్ధారణ జరిగి ప్రాణాంతక దుస్థితికి చేరుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ పట్ల అవగాహన కొరవడడం, ఆలస్యంగా రోగ నిర్ధారణ జరగడం, నివారణ మార్గాలను ప్రచారం చేయడం, ఈ వ్యాధి పట్ల పలు అపోహలు చక్కర్లు కొట్టడంతో దీని పట్ల సంపూర్ణ కనీస జ్ఞానం కలిపించడానికి ప్రతి ఏట 01 ఆగష్టు రోజున "ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం (వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే)" పాటించడం 2012 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం – 2025 ఇతివృత్తంగా "యునైటెడ్ బై యూనిక్" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఊపిరితిత్తుల కణజాలం అపరిమితంగా, నియంత్రణ కోల్పోయి పెరడంతో గడ్డలు ఏర్పడడాన్ని లంగ్ క్యాన్సర్ అని పిలుస్తూ, ఈ గడ్డలు ఇతర శరీర భాగాలకు వ్యాపించడం కూడా గమనించారు. ప్రపంచవ్యాప్తంగా పలు రకాలైన క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లనే అధిక మరణాలు నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధికి ప్రధాన కారణం స్మోకింగ్ లేదా పొగ తాగడాన్ని గుర్తించారు. ఫస్ట్ హాండ్ లేదా సెకండ్ హాండ్ స్మోకింగ్ లేదా ప్రత్యక్ష, పరోక్షంగా పొగ తాగడంతో పాటు పలు ఇతర కారణాల వల్ల కూడా లంగ్ క్యాన్సర్ రావచ్చు. దీర్ఘకాలం పాటు కలుషిత గాలి పోల్చడం, పని ప్రదేశంలో ఆజ్‌బెస్టాస్/డిజిల్/సిలికా/ఆర్సనిక్/రెడాన్ వాయువులను పీల్చడం, జన్యుపరంగా తల్లితండ్రుల నుంచి పిల్లలకు సోకడం లాంటి కారణాలతో కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ రావచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల్లో దగ్గు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శ్వాస ఆడకపోవడం, దగ్గినపుడు రక్తం పడడం, అలసిపోవడం, బలహీనత, గొంతు బొంగురు పోవడం లేదా కఠ స్వరం మారడం, మెడ వాపు, ఎముకల నొప్పి, న్యుమోనియా, బ్రాంకైటిస్ లాంటి పలు రోగ లక్షణాలు బయట పడతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఎక్స్-రే, సిటీ స్కాన్, పిఈటి-సిటీ స్కాన్, బ్రాంకోస్కోపీ, బయాప్సీ, స్పూటమ్ సైటాలజీ లాంటి పరీక్షలు చేస్తారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స మార్గాల్లో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథేరపీ, ఇమ్యూనోథెరపీ, పలు అత్యాధునిక డిజిటల్ టెక్నిక్స్‌ను వినియోగిస్తున్నారు. పొగ తాగడం ప్రధాన కారణంగా గుర్తించబడిన ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి పొగ తాగని వ్యక్తులకు కూడా రావచ్చు. పొగ తాగడమనే దురవాటుకు దూరంగా ఉండడంతో పాటు త్వరగా తొలి దశలోనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, కలుషిత గాలి పేల్చకుండా చూసుకోవడం, పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. తొలి దశలో గుర్తించి ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిని చికిత్సతో నయం చేయవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన సందర్భంలో తగిన చికిత్సలు తీసుకోవాలి. క్యాన్సర్ అంటే సత్వర మరణం కాదని, క్యాన్సర్‌కు కూడా చికిత్స ఉందని ధైర్యంగా ఎదుర్కొని వైద్యం చేయించుకోవాలి.

# రెండు దశాబ్దాల కల నెరవేరిన వేళ..

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి 2003వ సంవత్సరంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. వేలాది నిరు ద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. 2004 ఏప్రిల్‌లో పరీక్ష రాశారు. అదే ఏడాది జూన్‌లో ఫలితాలు కూడా ప్రకటిం చారు. తర్వాత నెలలో నియామక ప్రక్రియ ఉంటుందని చెప్పిన ప్రభుత్వం, ఆ నియామకాలను 2005 నవంబర్‌లో పూర్తి చేసింది. అయితే 2004లో జనవరి ఒకటి నుండి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమల్లోకి వచ్చిన నూతన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని, అదే ఏడాది సెప్టెంబర్ ఒకటి నుండి అప్పటి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ క్రమంలో 2003లో విడుదలైన నోటిఫికేషన్‌లో ఈ నూతన పెన్షన్ పథకాన్ని గురించి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, కేవలం నియాకపు తేదీని పరిగణించింది. డీఎస్సీ-2003 వారికి జీపీఎఫ్ స్థానంలో సీపీఎస్ ఖాతా ప్రారంభించింది. దీంతో ఆందోళనకు గురైన డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు వారి సంఘాల సహాయంతో ప్రభుత్వ పెద్దలను, అధికారులను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. పైగా వారికి నూతన పెన్షన్ పథకాన్నే అమలు చేసింది. పాత పెన్షన్ స్కీమ్‌నే కొనసాగించాలని విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో డీఎస్సీ-2003 ఉపాధ్యాయులే నాయ కులుగా, కార్యకర్తలుగా "డీఎస్సీ-2003 పాత పెన్షన్ సాధన సమితి"ని ఏర్పాటు చేసుకుని ఉద్యమాన్ని ప్రారంభించారు. పాత పెన్షన్ అమలుకు రాజకీయ నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యం కారణంగా, తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయం కోరుతూ 2019లో సీనియర్ న్యాయవాది, కీర్తిశేషులు రామచంద్రరావు ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. ఆనాటి నుండి హైకోర్టులో సుదీర్ఘ కాలంలో అనేక వాద ప్రతివాదనలు జరుగుతున్న కాలంలోనే, కేంద్ర ప్రభుత్వం 2023లో ఇదే తరహాలో నియామక ప్రక్రియ ఆలస్యం చేసింది. దీంతో కొంతమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నూతన పెన్షన్ విధానంలోకి అనివార్యంగా నెట్టివేయాల్సి వచ్చింది. అయితే వారికి పాత పెన్షన్‌కు అవకాశం కల్పిస్తూ మెమో నంబర్ 57/5 కేంద్రం విడుదల చేసింది. దీంతో పాత పెన్షన్‌ను కొంతమందికి అమలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఇదే సమస్యను ఎదుర్కొంటున్న 2023 ఉద్యోగులకు ఇన్నాళ్ల తర్వాత హైకోర్టు న్యాయం చేసింది. పాత పెన్షన్‌నే అమలు చేయాలని మొన్న తన తుది తీర్పును వెలువరించింది. దీంతో ఉద్యోగులకు పెన్షన్ పథకం నిర్ధారించే సందర్భంలో ఆ ఉద్యోగి నియామక నోటిఫికేషన్ తేదీలనే పరిగణించా లని ఈ తీర్పుతో కోర్టు స్పష్టతను ఇచినట్లయింది. ఈ తీర్పు వలన రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది వేల మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరుతుంది. దీనివలన కేంద్ర ప్రభుత్వం అజమాయిషీలో పనిచేసే కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం నిర్వహణా సంస్థ ఎన్‌పీఎస్, ఎన్ఎస్‌డీఎల్ నుండి, ప్రభుత్వం, ఉపాధ్యాయుల భాగస్వామ్య పద్ధతిలో పెట్టుబడి పెట్టిన డబ్బులు తిరిగి జీపీఎఫ్‌కు బదలాయించేందుకు కేంద్రం అనుమతి ఇస్తుంది. పైగా ఇన్ని వేల మంది ఉపాధ్యాయులకు వారి పదిశాతం చందాకు తోడుగా ప్రభుత్వం కలిపి ఇస్తున్న పద్నాలుగు శాతం చందా డబ్బులు ఇక నుండి వీరి పేరు మీద పెన్షన్‌నిధికి జమ చేయాల్సిన అవసరం ఉండదు. ఆ మేరకు ప్రభుత్వానికి నెలకు సుమారు పదికోట్ల నుండి పదమూడు కోట్ల రూపాయల వరకూ ఖర్చు తగ్గుతుంది. ఈ విధంగా న్యాయం కోసం ఇన్నేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు వందల మంది ఉపాధ్యాయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇన్నేండ్ల తర్వాత తుది తీర్పు వెలువడటంతో రెండు దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్న వారి కల నెరవేరినట్లయింది.

# లిక్కర్ కేసు...

# నెక్ట్స్ అరెస్టులేనా

విజయవాడ, జూలై 31,లిక్కర్ కేసు దర్యాప్తు స్పీడప్ అయింది. మూడు నెలలుగా వరుస పెట్టి అరెస్టులు నడుస్తున్నాయ్. లాస్ట్‌కు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని కూడా సిట్ అరెస్ట్ చేసి జైలుకు పంపింది.

ఆ తర్వాత మూమెంటమ్ ఇంకా స్పీడప్ అయినట్లు కనిపిస్తోంది. సాధ్యమైనంత త్వరగా ఈ కేసును పూర్తిగా కోర్టు మెట్లెక్కించే ప్రయత్నం జరుగుతోంది. అంతిమ లబ్ధిదారుడని చెప్తున్న వ్యక్తి టార్గెట్‌గా..పకడ్బందీగా ఆధారాలు, నగదు సీజ్‌తో లిక్కర్ కేసును సిట్ మరింత స్ట్రాంగ్ చేస్తుదంటున్నారు.ఇప్పటివరకు స్కామ్ లేదు..లావాదేవీలు లేవు..

అంతా ట్రాన్సపరెంట్‌గా జరిగిందని..తమను ఇబ్బంది పెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తూ వస్తున్నారు వైసీపీ అగ్రనేతలు. లిక్కర్ కేసు నిందితుల అకౌంట్లు, వారి కంపెనీలకు సంబంధించి సిట్ ఇప్పటికే 62.85 కోట్లు విలువ చేసే నగదు, ఇతర వస్తువులను సీజ్ చేసింది. ఇప్పుడు మరోసారి హైదరాబాద్‌లో 11 కోట్ల రూపాయలు పట్టుకుంది. సేమ్‌టైమ్‌లో ఏ4గా ఉన్న వరుణ్‌ను అరెస్ట్ చేసింది. లిక్కర్ కేసులో ఏ1గా ఉన్న రాజ్‌కసిరెడ్డి ఇచ్చిన ఇన్ఫోతోనే..వరుణ్ అరెస్ట్‌తో నగదు సీజ్ జరిగిందని అంటున్నారు.హైదరాబాద్ శివార్లలోని ఓ గెస్ట్ హౌస్ లో అట్టపెట్టెల్లో దాచిన నోట్ల కట్టలను ఏపీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగర శివార్లలోని కాచారం గ్రామంలో సులోచన ఫార్మ్ హౌస్ లో భారీగా నగదు దాచినట్లు అందిన పక్కా సమాచారంతో దాడులు చేసి నగదు సీజ్ చేశారు. ఈ డబ్బు లిక్కర్ స్కాంలో వచ్చిన కమిషన్ డబ్బుగా పోలీసులు చెబుతున్నారు. ఏ40 వరుణ్ ఇచ్చిన సమాచారంతో సిట్ పోలీసులు సులోచన ఫార్మ్ హౌస్‌లో తనిఖీ చేయగా 12 అట్ట పెట్టెల్లో రూ.11 కోట్లు నగదు బయటపడింది.భారీగా నగదు లభించడంతో లిక్కర్ స్కామ్‌లో సిట్‌కు పెద్ద ఆధారం దొరికినట్లు అయింది. అంతేకాకుండా సిట్ మొదటి నుంచి చెబుతున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా పెద్ద ఎత్తున నగదు చేతులు మారిందని ఈ ఘటన రుజువు చేసిందని అంటున్నారు. లిక్కర్ స్కాం కేసులో ఏ1గా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఏ40 వరుణ్ ప్రధాన అనుచరుడుగా చెబుతున్నారు. వరుణ్‌తో పాటు ఇదే కేసులో మరో ఏ12 చాణక్య లిక్కర్ స్కాంలో కమిషన్ డబ్బు వసూలు చేసేవారని సిట్ పోలీసులు చెబుతున్నారు.ఈ ఇద్దరిని గతంలోనే అరెస్టు చేయగా, కమిషన్ కోసం వసూలు చేసిన డబ్బుపై ప్రశ్నించడంతో ఈ డంప్ బయటపడినట్లు తెలుస్తోంది. అయితే దొరికిన డబ్బు తమదని నిందితులు ఒప్పుకోకపోవచ్చు. తాము ఎలాంటి సమాచారం ఇవ్వకున్నా భయపెట్టి సంతకాలు చేయించారని కూడా రివర్స్ అలిగేషన్స్ చేయొచ్చు. ఈ నగదు సీజ్‌తోనే అంతా జరిగిపోతుందని అనుకోవడానికి అవకాశం ఏం లేదు. కానీ సిట్‌కు ఇదొక అస్త్రంగా మారొచ్చంటున్నారు.లిక్కర్ కేసులో బిగ్ బ్లాస్టింగ్ న్యూస్ రాబోతుందన్న ఊహాగానాలకు ఈ డెవలప్‌మెంట్స్ బలం చేకూరుస్తున్నాయి. పెద్దఎత్తున నగదు దొరకడంతో కీలక మలుపు తిరిగినట్లు అయింది. ఇప్పటివరకు అకౌంట్లలో ఉన్న బ్యాలెన్స్, ఆస్తులను, వస్తువులను జప్తు చేశారు సిట్ అధికారులు. ఇప్పుడు ఏకంగా 11 కోట్ల రూపాయల నగదు దొరికింది. ఇది కీలక ఆధారంగా..స్కామ్ జరిగిందని ప్రూవ్ చేయడానికి సిట్‌కు ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.అయితే ఈ పరిణామాలను బట్టి చూస్తే లిక్కర్ కేసులో త్వరలో పెద్ద తిమింగలం అరెస్ట్ పక్కా అంటూ టీడీపీ ఇస్తున్న లీకులు నిజం కాబోతున్నాయన్న టాక్ నడుస్తోంది. ఇప్పటికే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసింది సిట్. లిక్కర్ వ్యవహారంలో ఆయనే కీలక సూత్రధారుడని మొదటి నుంచి ఆరోపిస్తూ వస్తోన్న సిట్..9 నెలల తర్వాత ఆయన్ను అరెస్ట్ చేసింది. ఇక నెక్ట్స్ అరెస్ట్‌కు పెద్ద గ్యాప్ ఉండకపోవచ్చని అంటున్నారు. త్వరలోనే అరెస్ట్ అవుతారని ప్రచారంలో ఉన్న వారిలో ఇద్దరు వైసీపీ అగ్రనేతల వంతు కూడా రావొచ్చంటున్నారు.వైసీపీ అధినేత, ఆయనకు అత్యంత సన్నిహితుడిగా ఉండే వ్యక్తి..ఆ ఇద్దరికి ఉచ్చు బిగించే కార్యక్రమం వేగంగా జరుగుతోందన్న ప్రచారం బయలుదేరింది. అయితే అన్ని ప్రూఫ్స్ ఉన్నాయని..ఇంకా ఆధారాలు రాబట్టాల్సి ఉందని అంటున్నారు కూటమి పెద్దలు. త్వరలో మిథున్‌రెడ్డిని కస్టడీకి తీసుకుని విచారించి..ఆ తర్వాత కింగ్‌పిన్‌గా ఆరోపిస్తున్న నేతలకు నోటీసులు ఇస్తారన్న టాక్ నడుస్తోంది. ఏదైనా హైదరాబాద్ శివారులో దొరికిన నగదుతో లిక్కర్ కేసు మరో టర్న్ తీసుకోవడం పక్కా. నెక్ట్స్ సిట్ అడుగులు ఎటువైపు పడతాయో చూడాలి.

## అమరావతిలో గోపీచంద్ అకాడమి

విజయవాడ, జూలై 31, ఏపీ రాజధాని అమరావతిని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని భావిస్తోన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్ సిటీ నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు తన సింగపూర్ పర్యటనలో సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శించారు. అక్కడ అందిస్తున్న ట్రైనింగ్ వివరాలు, చదువుతో పాటుగా క్రీడలలో ఎలా శిక్షణ ఇస్తున్నారనేదీ అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నారు. అమరావతి స్పోర్ట్స్ సిటీలో గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో.. సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శన ప్రాధాన్యం సంతరించుకుంది.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వంటి నిర్మాణాలను చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అలాగే అమరావతిలో పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎంఎస్కే ప్రసాద్ క్రికెట్ అకాడమీలను ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం ఇటీవల భూములు కూడా కేటాయించింది. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ కోసం అమరావతిలో 12 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఏపీ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు ఏపీలో పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ కోసం స్థలం కేటాయిస్తామని 2016లో అప్పుడు సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు మాట ఇచ్చారు. అయితే ఆ తర్వాతి ఎన్నికలలో టీడీపీ ఓడిపోవటంతో ఇది వీలు కాలేదు. తాజాగా పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీ కోసం 12 ఎకరాలు కేటాయించారు. అమరావతిలో నిర్మించనున్న అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీలోనే పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. అయితే అమరావతిలో గోపీచంద్ అకాడమీ ఏర్పాటు కోసం ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయనే చెప్పాలి. సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లారు.అయితే చంద్రబాబు సింగపూర్ పర్యటనలో పుల్లెల గోపీచంద్ కూడా కనిపించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా చంద్రబాబు సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో పాటుగా గోపీచంద్ కూడా సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శించారు. సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ ఓంగ్ కిమ్ సూన్‌ను అడిగి స్పోర్ట్స్ స్కూల్‌లో అందిస్తున్న ట్రైనింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.చదువుతో పాటుగా ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణను ఎలా విద్యార్థులకు అందించవచ్చనే దానిపై సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోనూ సింగపూర్ స్పోర్ట్స్ మోడల్ ఎలా అనుసరించవచ్చనే దానిపై చర్చించారు. సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శన ద్వారా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అండ్ అథ్లెట్ డెవలప్‌మెంట్ గురించి విలువైన సమాచారం అందిందంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.అయితే చంద్రబాబు సింగపూర్ పర్యటనలో బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ కనిపించడం.. సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శన నేపథ్యంలో అమరావతిలో త్వరలోనే గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాట్లు మొదలవుతాయనే వార్తలు వస్తున్నాయి

## ప్రకాశం బ్యారేజ్ వద్ద పెరుగుతున్న వరద

విజయవాడ ప్రకాశం బ్యారేజ్ దగ్గర వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 2.54 లక్షల క్యూసెక్కులు. కృష్ణానదీ పరీవాహక ప్రాంత ప్రజలు,లంకగ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పంట్లు,నాటుపడవలతో నదిలో ప్రయాణించవద్దు. వరద నీటిలో ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదని అధికారులు హెచ్చరించారు.

# కియాతో ఎమ్మెల్యే కయ్యం...

అనంతపురం, జూలై 31, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని సార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మంత్రుల్లో మార్పు రావడం లేదు. అందులో తొలిసారి మంత్రులుగా అయిన వారు మరీ పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. మొదటి సారి ఎమ్మెల్యే టిక్కెట్ దక్కించుకుని లక్కుతో కేబినెట్ లో సామాజికవర్గం కోణంలో చోటు దక్కించుకున్న వారి అనుచరులు రెచ్చిపోతున్నారు. చివరకు చంద్రబాబు 2014 నుంచి 2019 వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెనకబడిన ప్రాంతమైన రాయలసీమకు తెచ్చిన కియా పరిశ్రమపై కూడా బెదిరింపులకు దిగుతున్నారు. చంద్రబాబుకు ఈ విషయం తెలిస్తే రాజకీయంగా ఇబ్బంది అవుతుందని తెలిసినా లెక్కచేయడం లేదు. కనీసం మంత్రి తన అనుచరులను కూడాకట్టడి చేయలేని పరిస్థితుల్లో ఉన్నారా? అన్నది ఇప్పుడు టీడీపీలో హాట్ టాపిక్ గా మారింది. మొదటి సారి గెలిచినా... పెనుకొండ నియోజకవర్గం నుంచి సవిత మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు. అయిన వెంటనే లక్కు కలిసి వచ్చి చంద్రబాబు కేబినెట్ లో మంత్రి అయ్యారు. ఇటీవల మంత్రి సవితకు అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఫస్ట్ టైమ్ గా ఎన్నికై అదేదో తమ వల్లనే గెలిచామన్న భావనలో భావనతోనే వీరితో పాటు మంత్రి అనుచరులు కూడా రెచ్చిపోతున్నారని విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అనచరులు చంద్రబాబు సర్కార్ కు తలనొప్పులు తెచ్చేలా వ్యవహస్తున్నారు. అణిగి మణిగి ఉండాల్సిన అమాత్యురాలు తన అధికారంతో అధికారుల చేత పనులు చేయించుకోవాల్సిన మంత్రి సవిత దురుసు ప్రవర్తన పార్టీకి ఇబ్బంది కరంగా మారింది. పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్ ఇచ్చిన బోకేను మంత్రి సవిత విసిరేసిన వీడియో వైరల్ గా మారింది. గతంలో జరిగిన ఈ ఘటనపై చంద్రబాబు హెచ్చరించినా మార్పు రాలేదు కియా అనుబంధ పరిశ్రమలో... తాజాగా అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలో ఉన్న కియా అనుబంధ పరిశ్రమల దగ్గర మంత్రి సవిత అనుచరుల దౌర్జన్యానికి దిగడం కూడా చర్చనీయాంశమైంది. కియాలో చేపట్టే అన్ని కాంట్రాక్టు పనులు తమకే ఇవ్వాలని మంత్రి సవిత అనుచరులు బెదిరింపులకు దిగడం చర్చనీయాంశంగా మారింది. పెనుకొండ నియోజకవర్గం అమ్మవారిపల్లి దగ్గర ఘటన జరిగింది. కియా అనుబంధ పరిశ్రమల సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి దిగిన మంత్రి సవిత అనుచరులు చివరకు దానిని కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధుల సెల్ ఫోన్లు లాక్కున్నారు. ఈ దృశ్యాలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో టీడీపీ నేతలే పార్టీ కేంద్ర కార్యాలయానికి వీడియోలు పంపినట్లు తెలిసింది. కేబినెట్ లో మార్పులుంటాయని, జాగ్రత్తగా ఉండాలని ఇటీవలమంత్రి వర్గం సమావేశంలో చంద్రబాబు చేసిన హెచ్చరికలు కూడా సీమ తమ్ముళ్లలో పనిచేయడం లేదన్నకామెంట్స్ వినపడుతున్నాయి.

# అప్పుడు రెచ్చిపోయారు..

# ఇప్పుడు అనుభవిస్తున్నారు

గుంటూరు, జూలై 31, అధికారం ఉన్నప్పుడు ఎవరూ విర్రవీగ కూడదు. పదవుల కోసమో.. పైవాళ్ల ప్రాపకం కోసమో వీధుల్లో రౌడీల్లాగా వ్యవహరిస్తే ప్రభుత్వం మారిన తర్వాత ఎవరైనా శిక్ష అనుభవించక తప్పదు. ఇందుకు మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ ఒక ఉదాహరణ. వైసీపీ అధికారంలో ఉండగా తురకా కిషోర్ చెలరేగిపోయాడు. పల్నాడు పర్యటనకు వచ్చిన నాటి టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమామహేశ్వరరావు వచ్చినప్పుడు తురకా కిషోర్ వాళ్ల వాహనంపై దాడికి దిగారు. దీంతో మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ గా పదవి లభించింది. నాలుగేళ్లు హ్యాపీనే. తర్వాతే తురకా కిషోర్ కు కష్టాలు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని నెలలుగా జైలులోనే ఉన్నారు. తురకా కిషోర్ మాజీ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ముఖ్య అనుచరుడు. అయితే పిన్నెల్లికి ఓటమి లేదని భావించి తురకా కిషోర్ రెచ్చిపోయాడు. అందులోనూ వైసీపీ అధికారంలో ఉండటంతో తానే ఎమ్మెల్యేకు రైట్ హ్యాండ్ లాగా వ్యవహరించాడు. అంతటితో ఆగలేదు. నియోజకవర్గంలోని అనేక మంది టీడీపీ నేతలను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేశాడు. అప్పుడు హ్యాపీగానే ఉంది. అధికారం ఉన్నప్పుడు ఆల్ ఈజ్ వెల్. కానీ ప్రభుత్వం మారిన వెంటనే ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఓటమి పాలు కావడంతో పాటు పార్టీ కూడా అధికారం కోల్పోవడంతో తురకా కిషోర్ పై వరస కేసులు నమోదవుతున్నాయి. ఎక్కడెక్కడి వారో వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికే తురకా కిషోర్ పై పదికి పైగా కేసులు నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గంలోని పలు పోలీస్ స్టేషన్ లో నమోదయిన కేసుల్లో తురకా కిషోర్ నిందితుడిగా ఉన్నాడు. దీంతో గత కొద్ది నెలలుగా జైలు జీవితమే గడుపుతున్నాడు. తాజాగా తురకా కిశోర్ పై నమోదయిన అన్ని కేసుల్లో బెయిల్ లభించింది. అయితే పోలీసులు వదులుతారా? మరో కేసు రెడీ గా ఉంది. గుంటూరు జిల్లా జైలు నుండి విడుదలైన కిషోర్ ను రెంటచింతల పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఇంకా ఎన్ని కేసులు పెడతారంటూ కుటుంబ సభ్యులు పోలీసులను అడ్డగించినా చట్టం తన పనితాను చేసుకుపోతుందంటూ తురకా కిషోర్ ను రెంటచింతల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇంకా ఎన్ని కేసులు సిద్ధంగా ఉన్నాయో... చేసుకున్నోడికి.. చేసుకున్నంత.

## తలనొప్పిగా మారుతున్న జగన్ పర్యటనలు

నెల్లూరు, జూలై 31,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాల పర్యటన పోలీసులకు తలనొప్పిగా మారింది. ఇటు అధికారంలో ఉన్న పార్టీ నుంచి వత్తిడి రావడంతో పర్యటనలపై ఆంక్షలు విధిస్తున్నారు. అయితే ఆంక్షలను వైసీపీ కార్యకర్తలు ఏ మాత్రం లెక్క చేయరనీ తెలుసు. ఎందుకంటే గతంలో గుంటూరు మిర్చియార్డు, తెనాలి, పొదిలి, రెంటపాళ్ల, చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం పర్యటనల్లో పోలీసులకు అర్థమయింది. పోలీసులు బ్యారికేడ్లు పెట్టినా ఎవరూ లెక్క చేయడం లేదు. దీంతో పోలీసులు అదనపు బలగాలను మొహరించారు. అయినా వైఎస్ జగన్ పర్యటనలో పార్టీ కార్యకర్తలను అడ్డుకోలేకపోతుండటంతో పర్యటన తర్వాత వరస కేసులు నమోదు చేస్తున్నారు. అయినా కేసులకు భయపడటం లేదు. తాజాగా నెల్లూరు జిల్లా పర్యటన కూడా పోలీసులకు తలనొప్పిగా మారింది. జగన్ నెల్లూరు పర్యటనలపై ఆంక్షలు విధించారు. హెలిప్యాడ్ వద్దకు పది మందిని మాత్రమే అనుమతించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటివద్దకు జగన్ తో పాటు పదిహేను మందికి మాత్రమే అనుమతిచ్చారు. తొలుత జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని వైఎస్ జగన్ పరామర్శిస్తారు. జైలు వద్దకు జగన్ తో పాటు ముగ్గురిని మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. అయితే జగన్ పర్యటన సందర్భంగా తాము వైసీపీ కార్యకర్తలను అదుపు చేయలేమని వైసీపీ నేతలు చెబుతున్నారు. అయితే సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉందని పోలీసులు చెబుతున్నారు. దీంతో జగన్ నెల్లూరు పర్యటన టెన్షన్ మధ్య కొనసాగే అవకాశముందంటున్నారు.. జిల్లా నలుమూలల నుంచి పోలీసు బలగాలను నెల్లూరుకు దింపారు. జైలు పరిసర ప్రాంతాల్లోనూ, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటి వద్ద పెద్దయెత్తున బలగాలను దించేందుకు సిద్ధమవుతున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కేసులు పెడతామని పోలీసులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడికి కూడా నోటీసులు జారీ చేశారు. కానీ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశముండటంతో ఉద్రిక్తతల మధ్య జగన్ పర్యటన కొనసాగే అవకాశముంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకే తాము ఆంక్షలు విధించామని పోలీసులు చెబుతున్నా, తమ నేత జిల్లా పర్యటనకు వస్తుంటే ఆంక్షలను విధించడమేంటని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద జగన్ పర్యటన ఎలా మొదలయి.. ఎలా ముగుస్తుందన్నది ఉత్కంఠగా మారింది.

# వడివడిగా నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు

ఒంగోలు, జూలై 31,ఆంధ్రప్రదేశ్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో కనిగిరి వరకు ట్రాక్ నిర్మాణం దాదాపు పూర్తయింది. దర్శి రైల్వే స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఏడాదిలోనే ఈ స్టేషన్ మీదుగా రైలు పరుగులు తీయనుంది. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుండి తిరుపతి, చెన్నై వెళ్లడం సులువు అవుతుంది. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుంది.ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన రైల్వే లైన్ నిర్మాణ పనులు మరింత వేగవంతం అయ్యాయి. హైదరాబాద్ వైపు నుంచి ఏపీకి కీలకమైన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు ప్రకాశం జిల్లాలో కొనసాగుతున్నాయి. కనిగిరి వరకు ట్రాక్ నిర్మాణ పనులు ప్రస్తుతం ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.. అలాగే రైల్వే స్టేషన్‌ల పనులు చేపట్టారు. ఈ మార్గంలో దర్శి రైల్వే స్టేషన్ పనులు దాదాపుగా పూర్తికాగా.. మెయిన్ రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేశారు. లూప్‌లైన్ మూడు ట్రాక్ పనులు కూడా ముగింపులో ఉన్నాయి. ప్రస్తుతం దర్శి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్‌తో పాటుగా ప్రయాణికులు కూర్చోవడానికి సౌకర్యంగా బల్లలు, తాగునీరు కోసం ఏర్పాట్లు చేసి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులకు సంబంధించి గెస్ట్ హౌస్, సిగ్నల్ ఆఫీస్ పనులు ముగించారు.దర్శి రైల్వే స్టేషన్ బయట, లోపల లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.. స్టేషన్ బయట గ్రీనరీ ఉండేలా చక్కగా మొక్కలు నాటారు. 90శాతం వరకు పనులు పూర్తయ్యాయని.. మిగిలిన పనుల్ని త్వరలోనే పూర్తి చేస్తామంటున్నారు అధికారులు. ఇప్పటికే ప్యాసింజర్ రైలుతో ట్రయల్ రన్ నిర్వహించామని.. ఈ ఏడాదిలో దర్శి రైల్వే స్టేషన్ మీదుగా రైలు పరుగులు తీయడం ఖాయం అంటున్నారు. అయితే ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తిరుపతి, చెన్నై వెళ్లాలంటే మూడు రైలు మార్గాలు ఉన్నాయి. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే కనుక.. హైదరాబాద్ వైపు నుంచి తిరుపతి, చెన్నై వైపు చాలా త్వరగా వెళ్లొచ్చు అంటున్నారు.నడికుడి నుంచి శ్రీకాళహస్తి వరకు 309 కిలోమీటర్లు ఉన్న ఈ రైల్వే లైన్ పనుల్ని ఐదు దశలుగా చేపట్టేందుకు ప్లాన్ చేశారు. ప్రకాశం జిల్లాలో మూడు, నాలుగు దశల్లో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ ట్రాక్ నిర్మాణం ప్రకాశం జిల్లాలోని పొదిలి సమీపంలో గార్లపేట వరకు (145 కిలోమీటర్లు) వరకు దాదాపుగా పూర్తయ్యింది.. కేవలం 200 మీటర్లు మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం కనిగిరి వైపుగా ట్రాక్ నిర్మాణ పనులు వేగవంతం చేశారు. అలాగే పొదిలి, గార్లపేట, కనిగిరి, గౌతువారిపల్లి రైల్వే స్టేషన్ పనులు కూడా ముగింపు దశకు వచ్చాయి.పేరంగుడిపల్లి దగ్గర ఈ రైల్వే లైన్‌కు సంబంధించిన బ్రిడ్జి నిర్మాణం మాత్రం.. నేషనల్ హైవే పనులు పూర్తయ్యాకే చేపడతాము అంటున్నారు. ఇక కనిగిరి నుంచి పామూరు మధ్యలో రైల్వే లైన్ పనుల కోసం టెండర్ల పూర్తి చేశారు.. త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం ఉందంటున్నారు.నడికుడి నుంచి శ్రీకాళహస్తి రైల్వే లైన్ కోసం పశ్చిమ ప్రకాశం జిల్లావాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా దర్శి, పొదిలి, కనిగిరి ప్రాంతానికి చెందినవారు ఈ రైల్వే లైన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాదిన్నరగా ఈ రైల్వే లైన్ పనులు వేగవంతం చేశారు..

అలాగే పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తిచేసి పనుల్ని మరింత వేగవంతం చేశారు. అన్ని కుదిరితే ఈ ఏడాది దర్శి, పొదిలి మీదుగా కనిగిరి వరకు రైలు పరుగులు తీయడం ఖాయం అంటున్నారు.

# ఆమూడు జిల్లాలకు మహర్ధశ

విశాఖపట్టణం, జూలై 31, విశాఖ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఏపీకి ఆర్థిక రాజధానిగా మారుతోంది. ముఖ్యంగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ నగరం అభివృద్ధి పట్టాలెక్కుతోంది. రాష్ట్రంలో గమ్య నగరంగా విశాఖకు పేరు ఉంది. జాతీయస్థాయిలో పర్యాటకంగా మంచి గుర్తింపు ఉంది. సువిశాల సముద్రతీరం.. ఆపై మన్యం ఈ జిల్లా సొంతం. అయితే విశాఖను ఐటీ హబ్ గా మార్చాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాణిజ్య వ్యాపార రంగాల్లో అగ్రగామిగా ఉంచేందుకు ఏర్పాటు చేస్తోంది. అందుకు విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ ( వి.ఎం.ఆర్.డి.ఏ ) మంచి ప్రయత్నాలు చేస్తోంది. విశాఖ నగరం అంటే ఒక్కటి కాదు. పక్కనే ఉన్న విజయనగరం, అనకాపల్లి, ఆపై అల్లూరి సీతారామరాజు జిల్లాలను కలుపుకుంటూ ఎన్నో మంచి పథకాలకు శ్రీకారం చుడుతోంది విఎంఆర్డిఏ. అభివృద్ధి చెందుతున్న నగరం కాబట్టి.. విశాల ప్రయోజనాలు, భవిష్యత్ అవసరాలను తీర్చుతూ నగర ప్రణాళిక వేస్తోంది కూటమి ప్రభుత్వం.నగరంలో ఎన్ఏడి జంక్షన్ వద్ద రాష్ట్రంలోనే అతిపెద్ద ఫ్లైఓవర్ ఉంది. అయితే నగరంలో పెరుగుతున్న వాహనాలు, ప్రయాణికుల దృష్ట్యా.. సమీపంలోని కాకాని నగర వద్ద మరో భూగర్భ వంతెన నిర్మించాలని వి ఎం ఆర్ డి ఏ నిర్ణయించింది. ఎన్ఏడి వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా వెళ్లేలా ఈ వంతెన నిర్మిస్తే.. కింది నుంచి వెళ్లే వారికి సులభంగా ఉంటుంది. అందుకే రూ.12.50 కోట్ల రూపాయల వ్యయంతో ఈ వంతెన నిర్మాణం చేపడుతున్నారు.మరోవైపు సిరిపురం ఉద్యోగ భవనం వద్ద వి ఎం ఆర్ డి ఏ కు 98 సెంట్లు స్థలం ఉంది. అక్కడ భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. సుమారు 100 కోట్ల రూపాయలతో దీని నిర్మాణం చేపట్టనున్నారు.

మరోవైపు ఇప్పటికే మధురవాడలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా మైదానం ఉంది. అయితే తాజాగా మధురవాడ సర్వేనెంబర్ 175 /4 లో విఎమ్ఆర్డిఏ కు మూడు ఎకరాల స్థలం ఉంది. అయితే అక్కడ పది కోట్ల రూపాయల వ్యయంతో అవుట్ డోర్ క్రీడా సముదాయాన్ని నిర్మించనున్నారు.నగరంలోని రెండు చోట్ల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి కూడా బీజం పడింది. పెందుర్తి మండలం చీమలపల్లి, ఎండాడ వద్ద వీటి నిర్మాణం చేపడుతున్నారు. దాదాపు 13 కోట్ల రూపాయల వ్యయంతో వీటి నిర్మాణం పూర్తి చేయనున్నారు అనకాపల్లి జోనల్ కార్యాలయం పునరుద్ధరణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అదనపు గదుల నిర్మాణంతో పాటు వాణిజ్య దుకాణాలను నిర్మిస్తున్నారు. ఇందుకుగాను ఐదు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

అభివృద్ధి పరుగుసాధారణంగా టిడిపి అధికారంలో ఉంటే విశాఖ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది అనే ముద్ర ఉంది. అయితే ఇప్పుడు జరుగుతోంది అదే. నగరంలో లీక్ వ్యూ లేఅవుట్ నుంచి నగరంపాలెం మీదుగా వాంబే కాలనీ వైపు దాదాపు 8 కోట్ల రూపాయలతో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. అనకాపల్లి జిల్లా గొల్లల పాలెం ఆర్సి లేఅవుట్ నుంచి అమృతపురం రోడ్డు వరకు 60 అడుగుల రోడ్డును 25 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నారు. లంకెలపాలెం నుంచి అస్కపల్లి రోడ్డును ముసిడివాడకు కలిపేలా 100 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నారు.

దీనికిగాను దాదాపు 31 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మరోవైపు గండిగుండం నుంచి నిర్మించే రోడ్డు చింతపాలెం వద్ద అరకు మార్గాన్ని కలపనున్నారు.

నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేసేందుకు గాను దీనిని నిర్మిస్తున్నారు. ఇందుకుగాను 44 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇలా చంద్రబాబు సర్కార్ వచ్చిన తర్వాత విశాఖ నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రజలు కూడా ప్రభుత్వం విషయంలో సానుకూలంగా ఉన్నారు. అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నారు.


# సింగపూర్ పైనే ఆశలన్నీ

విజయవాడ, జూలై 31,అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి అమరావతిని ఒక కొలిక్కి తేవాలని చంద్రబాబు భావిస్తున్నారు. దాదాపు ఏడాది పాటు నిధుల కోసం శ్రమించారు. ఆపై కేంద్ర ప్రభుత్వం కూడా సాయం ప్రకటించింది. దీంతో అమరావతికి నిధులు పోగయ్యాయి. ఈ క్రమంలోనే అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రధాని నరేంద్ర మోడీతో ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రైవేటు సంస్థలు సైతం సన్నాహాలు ప్రారంభించాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం నిర్మాణాలు జరిపించేందుకు ముందుకు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వపరంగా రైల్వే, రోడ్డు ప్రాజెక్టు నిర్మాణ పనులు కూడా ప్రారంభం అవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అమరావతి పనులు ఇక వేగవంతం అయినట్టే.రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకుంటే అమరావతి రాజధాని అనేది ప్రాధాన్యత అంశంగా మారింది. సాధారణ పరిపాలన కొనసాగిస్తూనే అమరావతిని పూర్తి చేయాలన్నది చంద్రబాబుప్లాన్. అదే సమయంలో సంక్షేమ పథకాలను సైతం పారదర్శకంగా అమలు చేసి ప్రజల అభిమానాన్ని పొందాలన్నది ప్రణాళిక. ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలి. అమరావతి రాజధాని ఒక రూపం రావాలి. ప్రజలు దానిని గుర్తించాలి. 2029లో కూటమికి మరోసారి అవకాశం ఇవ్వాలి. చంద్రబాబు దూరంగా ఆలోచన చేస్తోంది అదే. అయితే ప్రతిపక్షాలు మాత్రం వచ్చిన ఏడాదిలోనే అప్పులు పెరిగిపోయాయని ఆరోపిస్తున్నాయి. అభివృద్ధి లేదని చెబుతున్నాయి. కానీ ప్రజల్లో మాత్రం ఆ అభిప్రాయం లేదు. ఎక్కడ వ్యతిరేకత కనిపించడం లేదు. కానీ అసంతృప్తి మాత్రం వ్యక్తమవుతోంది.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా అమరావతి ఇక ఆగదు. తాజాగా సింగపూర్ వెళ్లారు చంద్రబాబు. తనతో పాటు ప్రత్యేక బృందాన్ని తీసుకెళ్లారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలన్న ఆలోచనతోనే ఆయన సింగపూర్ పర్యటనకు వెళ్లారు. అయితే పనిలో పనిగా అమరావతి రాజధానికి కూడా సింగపూర్ బృందం సాయం అడగనున్నారు. గతంలో కూడా అమరావతి రాజధాని లో సింగపూర్ ప్రభుత్వం భాగస్వామ్యం అయింది. ఇప్పుడు కూడా అమరావతి రాజధాని నిర్మాణంలో సింగపూర్ ను పాలుపంచుకోవాలని ఆయన కోరే అవకాశం ఉంది. మరోవైపు చంద్రబాబు ఆలోచనలను ఇష్టపడే పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ఉన్నత రంగాల్లో ఉన్నవారు ఉన్నారు. వారందరిని గతం మాదిరిగా అమరావతి నిర్మాణం కోసం సాయం చేయాలని అడిగితే మాత్రం తప్పకుండా ముందుకు వస్తారు. అయితే అమరావతి రాజధాని నిర్మాణాన్ని ప్రభుత్వ బాధ్యతగా తీసుకొని.. పి4 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుపేదల జీవన ప్రమాణాన్ని పెంచాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. వారికి సాయం చేసేందుకు మాత్రమే బంగారు కుటుంబాలు మార్గదర్శకులు పేరిట ఒక ప్రాజెక్టును రూపొందించారు. పేదలకు సాయం చేసే వీలుగా మార్గదర్శకులు కావాలని మాత్రమే విదేశాల్లో ఉన్న ప్రవాస ఆంధ్రులకు చంద్రబాబు కోరుతున్నారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని కేవలం ప్రభుత్వమే చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. అంటే సమాంతరంగా పాలనలో అభివృద్ధితోపాటు సంక్షేమం కొనసాగించనున్నారు అన్నమాట.

## వైరల్ గా మారిన 143 కథ

వైసీపీ పాలన గురించి కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయా? సింగపూర్‌లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు టీమ్‌కి తెలిసిన ఆ విషయమేంటి? సింగపూర్ ప్రభుత్వాన్ని మనీ డిమాండ్ చేసిందా? అవుననే అంటున్నాయి టీడీపీ వర్గాలు. ఇంతకీ ఏ విషయంలో తెలుసా? అక్కడికే వచ్చేద్దాం. 2014-19 మధ్యకాలంలో ఏపీ రాజధాని అమరావతికి ఉచితంగా మాస్టర్ ప్లాన్ ఇచ్చింది సింగపూర్ ప్రభుత్వం. అంతేకాదు పెట్టుబడులు పెట్టి పనులు మొదలుపెట్టడానికి ముందుకొచ్చింది. అయితే 2019లో టీడీపీ సర్కార్ పడిపోగానే పావులు కదిపింది అప్పటి వైసీపీ సర్కార్. ఆనాడు వైసీపీ ప్రభుత్వం సింగపూర్ ప్రభుత్వానికి ఓ లెటర్ పంపించింది. అడ్వాన్స్‌గా రూ. 143 కోట్లు ఇస్తే అమరావతి పనులు సాగుతాయన్నది అందులో ప్రధాన పాయింట్. అమరావతి-సింగపూర్ ప్రాజెక్ట్‌లో వైసీపీ డిమాండ్ చేసిన అడ్వాన్స్ ఇవ్వలేకపోవడంతో ఆ ప్రాజెక్టు నిలిపివేసింది. దానికి రకరకాలుగా కారణాలు చెప్పి అమరావతి నిర్మాణాన్ని గడిచిన ఐదేళ్లు ఆపేసింది వైసీపీ ప్రభుత్వం. ప్రస్తుతం సీఎం చంద్రబాబు టీమ్ సింగపూర్‌లో పర్యటిస్తోంది. అమరావతి విషయంలో సింగపూర్ ప్రభుత్వంతో చంద్రబాబు టీమ్ సమావేశమైంది. ఈ నేపథ్యంలో ఆనాటి విషయాలు తెలిసి ఒక్కసారిగా నేతలు షాకయ్యారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ప్రస్తావించింది టీడీపీ.యూత్ భాషలో 143 అంటే ఐ లవ్ యూ అని.. అదే జగన్ సీక్రెట్ భాషలో అయితే 143 అంటే ఐ లూట్ యూ అంటూ పేర్కొంది. దీని వెనుక ఇంకెన్ని విషయాలు చంద్రబాబు టీమ్‌కి తెలిసిందో తెలీదు. కేవలం ఈ ఒక్క విషయాన్ని బయటపెట్టింది. వైసీపీ ప్రభుత్వం గురించి చెప్పనక్కర్లేదు. వైసీపీ ప్రవేశపెట్టిన స్కీమ్‌లు ఏమోగానీ స్కాములుగా మార్చేశారంటూ పదేపదే టీడీపీ నేతలు చెబుతున్నారు. దాని ప్రకారమే లిక్కర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇసుక వ్యవహారంలో అలాగే సాగిందని అంటున్నారు. తాజాగా సింగపూర్ ప్రాజెక్టు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రాబోయే రోజుల్లో జగన్ పాలన గురించి ఇంకెన్ని కొత్త విషయాలు బయటకు వస్తాయో చూడాలి

# యువతలో గుండెపోటులు ఎందుకు..



హైదరాబాద్, జూలై 31,ఇటీవల ఉప్పల్‌లో ఓ యువకుడు బ్యాడ్మింటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీనికి కారణం అతడికి సడన్ కార్డియాక్ అరెస్ట్ కావడమే. సికింద్రాబాద్‌కు చెందిన 24ఏళ్ల యువకుడు జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఇటీవల గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోయాడు. ఇక్కడా గుండెపోటే కారణం. ఇలా ఇటీవల చాలామంది యువకులు ముఖ్యంగా 30 ఏళ్లలోపే గుండెపోటుకు గురవుతున్నారు. వీటన్నిటికీ కారణాలేంటి? ఈ యువత గుండెకు ఏమైంది. అంత వీక్‌గా మనోళ్లు ఉన్నారా? అన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశం కానున్నాయి.తమ దగ్గరికి వచ్చే గుండె జబ్బు బాధితుల్లో యువకులే ఎక్కువగా ఉంటున్నారని హృద్రోగ నిపుణులు కూడా చెబుతున్నారు. ఒకప్పుడు 50, 60 ఏళ్ల వయసు దాటిన వారిలోనే కనిపించే గుండె జబ్బులు.. ఇప్పుడు 20-30 ఏళ్ల వయసు వారిలోనూ చోటు చేసుకుంటున్నాయని హెచ్చరిస్తున్నారు. రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం, కండరాల వాపు వంటి వాటితో పాటు అంతకుముందు కుటుంబంలో ఎవరికో ఒకరికి ఈ జబ్బులు ఉంటేఈ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. చిన్నప్పటి నుంచే జంక్ ఫుడ్‌ను అధిక మొత్తంలో తీసుకుంటుండటం వల్ల కొవ్వు శాతం పెరిగి గుండె స్పందనల్లో తేడాలొస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరికి పుట్టుకతోనే గుండె జబ్బులు వస్తాయంటున్నారు. ఇక మాదక ద్రవ్యాలు, ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ గుండె సమస్యలొచ్చే ముప్పు అధికమని అంటున్నారు. అందుకే 25 ఏళ్లు దాటినప్పటి నుంచే గుండె ఆరోగ్యాన్ని తెలిపే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.చిన్న వయసులోనే క్రీడాకారులు ఇలాంటి ఆకస్మిక మరణానికి గురైతే హెచ్‌సీఎం- హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి కారణం అయి ఉంటుందన్నారు. ఈ వ్యాధి ఉన్న వారిలో గుండె కండరాలు లావుగా ఉంటాయి. ఇది వంశపారంపర్యంగా వచ్చి ఉంటుంది. వ్యాయామం చేసే సమయంలో గుండె నిమిషానికి 210 సార్లకంటే ఎక్కువగా కొట్టుకోవడం ద్వారా దాని చలనం ఆగిపోయి.. రక్తప్రసరణ జరగకుండా చనిపోతారు. యువకుల్లోనే ఇలాంటివి కనిపిస్తాయి. అథ్లెట్లు, క్రీడాకారులు కొన్ని రకాల స్టెరాయిడ్లు వినియోగించినా కండరాలు అధికంగా సంకోచ వ్యాకోచాలకు గురై ఒక దశలో ఆగిపోయి చనిపోతారు. వ్యాయామానికి ముందు యువకులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. తల్లిదండ్రులకు ఇతర రక్తసంబంధీకులకు గుండెజబ్బులు ఉంటే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.అలాగే మధుమేహం, అధిక రక్తపోటు రక్తనాళాలను దెబ్బతీసి, కొవ్వు పేరుకుపోయి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. షుగర్ ఉంటే 2 నుంచి 3 రెట్లు ఎక్కువ ముప్పు ఉంటుంది. కొవిడ్ వైరస్ గుండె కండరాలకు వాపు కలిగించవచ్చు. ఇది కూడా గుండె పోటు ప్రమాదాన్ని పెంచవచ్చు. యువతలో గుండెపోటు నివారించడానికి పండ్లు, కూరగాయలు, చేపలు, చికెన్, తృణధాన్యాల వంటి ఆహారాన్ని తీసుకోవాలంటున్నారు డాక్టర్లు. రోజూ ఎక్సర్‌సైజులు చేయాలని సూచిస్తున్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారు నడుస్తూనో.. వ్యాయామం చేస్తూనో.. గుండెనొప్పితో కుప్పకూలిపోతున్నారు. కార్డియాక్ అరెస్టు కావడమే ఇలాంటి ఘటనలకు కారణం.రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉన్నా.. ముందే గుర్తించకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. ఆహారం ఊపిరితిత్తులకు చేరడం వల్ల రక్తనాళాల్లో అడ్డుపడి మృత్యువాత పడతారు. స్టెరాయిడ్లు వాడకూడదు. చిన్న వ్యాయామాలకైనా.. పరిగెత్తినా అలసటగా ఉంటే వెంటనే గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. సడన్ స్ట్రోక్ వచ్చే వారిలో సగం మంది ఆస్పత్రికి చేరకుండానే మరణిస్తున్నారు. గుండెపోటు వచ్చిన తొలి గంటను గోల్డెన్ అవర్ అంటారు.. అప్పుడు తక్షణ చికిత్స అందిస్తే బాధితుడి కాపాడుకోవచ్చు. సీపీఆర్ చేయడం ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలంటున్నారు వైద్యులు.

# ఆయుర్వేద బిజినెస్ లోకి రిలయన్స్

ముంబై, జూలై 31, లయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఇప్పుడు ఆయుర్వేదంలోకి అడుగుపెట్టారు. రిలయన్స్ రిటైల్-లింక్డ్ బ్యూటీ ప్లాట్‌ఫామ్ 'తిరా' కొత్త బ్యూటీ బ్రాండ్‌ను ప్రారంభించింది. ఈ బ్రాండ్ పేరు పురవేద. ఈ బ్రాండ్ ఆయుర్వేదం ఆధారంగా రూపొందించారు. పురవేద నాలుగు విభిన్న శ్రేణులతో ప్రారంభమైంది. కంపెనీ ఈ చర్య బాబా రాందేవ్ కంపెనీ పతంజలితో సహా అనేక ఆయుర్వేద కంపెనీలతో పోటీపడుతుంది. ఈ బ్రాండ్ ద్వారా, తిరా వినియోగదారులకు ఉత్తమ సౌందర్య ఉత్పత్తులను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.తిరా సహ వ్యవస్థాపకురాలు, అఖా భక్తి మోడీ లాంచ్ సందర్భంగా మాట్లాడుతూ.. 'పురవేదను ప్రారంభించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఈ బ్రాండ్ భారతదేశ వారసత్వం, ఆవిష్కరణల మిశ్రమం. తిరాలో అందానికి అతీతంగా, స్వీయ సంరక్షణకు ప్రజలను ప్రేరేపించే బ్రాండ్‌లను ముందుకు తీసుకురావాలనుకుంటున్నాము. అని అన్నారు.పురవేద ఉత్పత్తులు సాంప్రదాయకమైనవి కానీ ఆధునిక పద్ధతిలో తయారు చేస్తారు. ఈ బ్రాండ్‌లో చర్మ సంరక్షణ , జుట్టు సంరక్షణ, శరీర సంరక్షణ ఉత్పత్తులు ఉన్నాయి. కంపెనీ మొత్తం 50 కంటే ఎక్కువ ఉత్పత్తులతో ప్రారంభమైంది. ఈ ఉత్పత్తులను నాలుగు వేర్వేరు శ్రేణులుగా విభజించారు. ఈ శ్రేణుల పేర్లు ధర, నియమం, సామ, ఉర్జా. వివిధ శ్రేణులలో వేర్వేరు పదార్థాలు ఉపయోగించారు. పురవేద ఉత్పత్తులను తిరా దుకాణాలు, తిరా వెబ్‌సైట్ నుండి కొనుగోలు చేయవచ్చు.రిలయన్స్ రిటైల్ 2023 సంవత్సరంలో తీరాను ప్రారంభించింది. తీరా భారతదేశంలోని 98% కంటే ఎక్కువ పిన్ కోడ్‌లకు డెలివరీ చేస్తుంది. దీనికి అనేక నగరాల్లో స్టోర్‌లు కూడా ఉన్నాయి. దీని ఉత్పత్తులను స్టోర్ నుండి లేదా తీరా వెబ్‌సైట్ నుండి కొనుగోలు చేయవచ్చు.

## కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## వదంతలను నమ్మవద్దు

విజయవాడ కృష్ణా నది వరద నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ వెల్లడించారు. 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ సేవలు అందుబాటులో వచ్చింది. 24 గంటలూ అందుబాటులో సిబ్బంది వుంటారు. ప్రజలు వరదకు సంబంధించిన సమస్యలను కంట్రోల్ రూమ్ కు తెలియజేయవచ్చు. తక్షణం స్పందించేందుకు క్షేత్ర స్థాయిలో సమన్వయ శాఖల బృందాలు సిద్ధం చేసాం. అధికారులందరినీ అప్రమత్తం చేశాం. ప్రజలు ధైర్యంగా, జాగ్రత్తగా ఉండాలి. వరదలపై వదంతులను నమ్మవద్దని అయన అన్నారు.

## వైకాపా తప్పులు బయటికి వస్తున్నాయి మంత్రి అనిత

అనకాపల్లి పీఎల్ పురం మార్కెట్ యార్డులో పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హోం మంత్రి వంగలపూడి అనిత హజరయ్యారు. చైర్మన్ గా దేవర సత్యనారాయణ,వైస్ చైర్మన్ గా కంకిపాటి వెంకటేశ్వరరావు,డైరెక్టర్ల చేత హోం మంత్రి ప్రమాణస్వీకారం చేయించారు. పాలకవర్గాన్ని సన్మానించి,శుభాకాంక్షలు తెలిపారు.హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ దేవర సత్యనారాయణ అజాత శత్రువు. గత ఐదు సంవత్సరాలు మార్కెట్ యార్డులను నాశనం చేశారు. నేను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలోనే పాయకరావుపేటకు ప్రత్యేకంగా మార్కెట్ యార్డును తీసుకువచ్చాం. పాయకరావుపేట మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్,గుడామును ఏర్పాటు చేస్తాం. ఎన్డియే కూటమి పని చేసిన వారికి గుర్తింపు ఇస్తుంది. పాయకరావుపేట టిడిపి కంచుకోట. 44 వేల మెజార్టీతో గెలిపించారు. పాయకరావుపేటలో ఒకవైపు వ్యవసాయం రంగాన్ని అభివృద్ధి చేస్తూ, మరోవైపు పరిశ్రమలు వస్తున్నాయి. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు రానున్నాయి. అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. వైసీపీ నాయకులు చేసిన తప్పులు ఒక్కక్కటి బయటికి వస్తున్నాయని అన్నారు. చేసిన తప్పులకు జైలుకు వెలుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి మాత్రం కొంతమందితో తిట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చంద్రబాబు,లోకేష్ సింగపూర్ వెళ్ళి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తుంటే, జగన్ మోహన్ రెడ్డి మాత్రం తల్లి,చెల్లిమీద కోర్టుకు వెళ్ళి గెలిచానని ఆనందపడుతున్నాడు. ప్రజలు ఒకసారి ఆలోచన చేయాలని అన్నారు.

# గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం

అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపుతుంది. రాత్రంతా ప్రశాంతంగా ఉన్న గ్రామంలో తెల్లారేసరికి మూడు రోడ్ల కూడలి మధ్యలో క్షుద్ర పూజలు చేసిన వస్తువులు ప్రత్యక్షమయ్యాయి. వాటిని గమనించిన స్థానికులు హడలిపోతున్నారు. నాగ పంచమి రోజున అతీత శక్తుల కోసం క్షుద్ర పూజలు చేసి ఉంటారని కొంతమంది భావిస్తుంటే, ఎవరి మీద అయినా కక్షతోనో లేక ఆధిపత్యం కోసమో ఈ పూజలు జరిగి ఉండొచ్చని మరికొందరు అనుకుంటున్నారు. ఎటువైపు నుంచిఎవరికి ముప్పు వస్తుందో అని మూఢ నమ్మకాలు ఉన్నవారు భయపడుతుంటే కొందరు యువకులు మూడు రోడ్ల కూడలిలో పెట్టి ఉంచిన క్షుద్ర పూజల వస్తువులను తగలబెట్టేశారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగటం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. అధికారులు ఇలాంటి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించే కళాజాత కార్యక్రమాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో చైతన్యం కలిగించి ఇలాంటి మూఢనమ్మకాల క్షుద్ర పూజలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# ట్రంప్ అన్నంతా పనిచేసేశాడు

ఫ్రెండూ ఫ్రెండూ అంటూనే భారత్‌పై 25 శాతం సుంకం బాంబ్‌ను భారత్‌పై వేసిన డోనాల్డ్ ట్రంప్ గట్టి షాక్ ఇచ్చారు. ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఈ ప్రకటన చేశారు.ఆగస్టు 1 నుంచి భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై అమెరికా 25 శాతం టారిఫ్‌ను విధిస్తుందని తెలిపారు.డోనల్డ్ ట్రంప్ ఇప్పటికే పలు దేశాలపై టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు.

అయితే, చర్చల కోసం ఈ టారిఫ్‌లను ప్రస్తుతం నిలిపివేశారు.ట్రేడ్ డీల్‌పై చర్చల కోసం ఆగస్టు 1ని తుది గడువుగా నిర్ణయించారు."భారత్‌లో ఏ దేశంలో లేని విధంగా అత్యంత కఠినమైన, అన్యాయమైన వాణిజ్య ఆంక్షలు ఉన్నాయి. అంతేకాక, భారత్ పెద్ద మొత్తంలో సైనిక ఆయుధాలను రష్యా నుంచి కొంటోంది. యుక్రెయిన్‌లో రష్యా చేస్తోన్న దాడులను ఆపాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటుంటే, చైనాతో పాటు భారత్ కూడా రష్యాకు అతిపెద్ద చమురు కొనుగోలుదారుగా ఉంది" అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ రాశారు.

"ఇవన్నీ అంత మంచివి కావు. వీటన్నింటికీ భారత్‌పై ఆగస్టు 1 నుంచి జరిమానాతో సహా 25 శాతం సుంకాలను విధిస్తున్నాం. ఈ అంశంపై దృష్టి సారించినందుకు ధన్యవాదాలు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.ట్రేడ్ డీల్‌పై భారత్, అమెరికా మధ్య ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి.

కానీ, ఇంకా ఎటువంటి ఒప్పందం కుదరలేదు.ఇక ఇప్పుడు పాక్ తో చేతులు కలిపి భారత్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. 25% సుంకాలు భారత్ పై విధించిన అమెరికా మరోవైపు దాయాది దేశం పాకిస్తాన్‌తో దోస్తీ చేసి చమురు నిల్వలను అభివృద్ధి చేసే దిశగా డీల్ కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. పైగా ఎమో ?ఎవరికి తెలుసు ఏదో ఒక రోజు పాకిస్తాన్ కూడా భారత్‌కు ఇంధనం విక్రయించవచ్చు అని అన్నారు. ఇండియా తమ మిత్ర దేశం అంటూ బిల్డప్ ఇచ్చే ట్రంప్ దాయాదితో చేతులు కలపడం పై రాజకీయ, వాణిజ్య వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.అయితే ఆ కొద్దిసేపటి తర్వాత మోదీ నా ఫ్రెండ్ ట్రేడ్ డీల్ పై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఇండియా యుఎస్ ప్రకటించిన 25% ట్యారీఫ్ పెనాల్టీ పై ఇంకా చర్చలు జరుగుతున్నాయన్నారు. ఇండియా అధికంగా ట్యారిఫ్స్ విధించడం, బ్రిక్స్ మెంబర్‌గా ఉండటాన్ని సమస్యగా భావిస్తున్నాం. బ్రిక్స్ డాలర్‌కు ముప్పుగా మారింది. ఇది సహించం ట్యారిఫ్ పెనాల్టీ డీల్ పై ఈ వారంతంలో క్లారిటీ వస్తుందని వ్యాఖ్యలు చేశారు .ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఇరుదేశాల పరస్పర ప్రయోజనాల కోసం కొన్ని నెలలుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

ద్వైపాక్షిక వాణిజ్యంపై ఎలా ఉండబోతుందో అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొంది. దేశ ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామంది. 25% భారత్ పై సుంకం విధించిన డోనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిందని ప్రకటించారు. దక్షిణ కొరియా నుంచి అమెరికాకు వచ్చే వస్తువులపై 15% సుంకం విధిస్తామన్నారు. ట్యారిఫ్‌పై వైట్ హౌస్ బిజీగా ఉందన్నారు. అయితే పాకిస్తాన్ తో భారీ చమురు నిల్వలు అభివృద్ధిపై రెండు దేశాలు కలిపి పని చేస్తాయని అమెరికా కొత్త ఒప్పందం పై సంతకం చేసిందన్నారు. ఇక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఒక చమురు కంపెనీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దీనివల్ల మన దేశానికి, ఎకానమీకి తీవ్ర నష్టం. యుఎస్ బెదిరింపులకు పీఎం భయపడకూడదు. పాక్ చైనాతో పాటు యూఎస్ సైతం మనకు పెద్ద సమస్యగా మారిందన్నారు. మరో వైపుఇతర దేశాల నుంచి కొనుగోలు చేసే ఉత్పత్తులపై విధించే పన్నునే టారిఫ్ అంటారు.విదేశీ కంపెనీల పోటీ నుంచి నిర్దేశిత రంగాలను రక్షించేందుకు వివిధ దేశాలు సాధారణంగా ఈ టారిఫ్‌ను వేస్తుంటాయి.10 శాతం బేస్‌లైన్ టారిఫ్ అంటే.. ఒక వస్తువు ధర 10 డాలర్లు ఉంటే, దానిపై 1 డాలర్ పన్ను పడుతుంది. అంటే దిగుమతి చేసుకున్నందుకు మొత్తంగా అయ్యే ఖర్చు 11 డాలర్లు.అమెరికాకు విదేశీ వస్తువులను తీసుకొచ్చే కంపెనీలు ప్రభుత్వానికి ఈ పన్నులు చెల్లించాలి.కంపెనీలు ఈ మొత్తంలో కొంత భాగాన్ని లేదా అదనపు ఖర్చు మొత్తాన్ని వినియోగదారులకు బదలాయిస్తుంటాయి.అమెరికా వస్తువులను దిగుమతి చేసుకునే దేశాలు భారీగా పన్నులు విధిస్తే, అమెరికా దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై కూడా భారీగా పన్నుల వడ్డింపు ఉంటుందని అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు.ట్రంప్ దీన్ని 'రెసిప్రోకల్ టారిఫ్' అంటున్నారు.భారత్‌పై ట్రంప్ 25 శాతం సుంకాలను విధించారు. పెనాల్టీ కూడా వేశారు. ట్రంప్ కోసం నరేంద్ర మోదీ ప్రచారం చేశారు. 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' (ఈసారి ట్రంప్ ప్రభుత్వం) అంటూ నినాదాలు కూడా చేశారు. ఆయన్ను ఒక సోదరుడిలా ఆలింగనం చేసుకున్నారు. అందుకు బదులుగా, ఇలాంటి కఠినమైన సుంకాలను ట్రంప్ భారత్‌పై వేశారు. ఇది ప్రభుత్వ విదేశాంగ విధానపు వైఫల్యం. ఒక వ్యక్తి స్నేహం వల్ల దేశమంతా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది" అని విమర్శించారు.'పరస్పర చర్చల తర్వాత ప్రెసిడెంట్ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని నేను అనుకోను. అమెరికా పరిపాలనా యంత్రాంగంతో మన వాణిజ్య మంత్రి నిత్యం చర్చలు జరుపుతున్నారు. ఈ అంశంపై చర్చల విషయంలో ఏదైనా అభ్యర్థన, డిమాండ్ ఉంటే పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే భారత్ ఎలాంటి నష్టాన్ని ఎదుర్కోదు" అని బీజేపీ ఎంపీ అశోక్ చవాన్ అన్నారు. టారిఫ్‌లపై ప్రకటనకు ముందు అమెరికా ప్రతినిధుల బృందం ఆగస్టు 25న న్యూఢిల్లీలో వాణిజ్య ఒప్పందంపై ఆరో విడత చర్చలకు రానున్నట్లు అధికారికంగా ప్రకటించడం గమనార్హం. ఈ నేపథ్యంలో ట్రంప్ చర్యను ఒత్తిడికి ఒక వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషకులు పరిగణిస్తున్నారు.

ఇక, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా నుంచి భారత్ చమురు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. యుద్ధానికి ముందు 0.2% ఉండగా.. ఇప్పుడు సుమారు 35-40% వరకు పెరిగాయి. ఈ విషయంలో చైనా తర్వాత రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటోన్న రెండో అతిపెద్ద దేశగా భారత్ నిలిచింది. అమెరికా, పశ్చిమ దేశాలు రష్యాపై ఒత్తిడి తేవాలని యత్నిస్తున్న సమయంలో, భారత్ వ్యవహారం తప్పుడు సంకేతాలు పంపుతోందని ట్రంప్ మండిపడుతున్నారు.

## మినీవ్యాన్, లారీ ఢీ?

## ఒకరు మృతి



ఏలూరు మొక్కజొన్న లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ముందు వెళ్తున్న లారీని ఓవర్టేక్ చేయబోయి అదుపుతప్పి అదే లారీని ఢీకొంది. ఈ ఘటనలో మినీ వ్యాన్ లో ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన ఏలూరు జాతీయ రహదారిలోని గుండుగొలను సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడు జగ్గంపేట మండలానికి చెందిన వినయ్ కుమార్ (21) గా గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ సురేష్ కు స్వల్ప గాయాలు అయ్యాయి.

## కాలువలో పడిన వ్యక్తిని కాపాడిన కార్పోరేటర్



సికింద్రాబాద్ అర్ధరాత్రి కాలువలో పడిన గుర్తు తెలియని వ్యక్తిని కార్పొరేటర్ కాపాడిన ఘటన సికింద్రాబాద్ లో చోటు చేసుకుంది. నిన్న అర్ధరాత్రి మెట్టుగూడ ఆర్ యూ బీ కామన్ వద్ద నాలాలో గుర్తు తెలియని వ్యక్తి పడి పోయిన విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే కార్పొరేటర్ రాసూరి సునీతకు సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఆమె పోలీసులకు, హైడ్రా సిబ్బందికి సమాచారమిచ్చి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బందిని సమన్వయం చేసి రెస్క్యూ చేసి ఆ వ్యక్తిని బయటకు తీశారు. అంబులెన్స్ లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తి గాంధీ నగర్ వాసిగా గుర్తించినట్లు సునీత తెలిపారు. వెంటనే స్పందించి వ్యక్తిని కాపాడిన కార్పొరేటర్ ను స్థానికులు అభినందించారు.

## బోనులో చిక్కిన చిరుత





రంగారెడ్డి మంచిరేవుల లోని ఈకో టెక్ పార్కు బోన్ లో చిరుత చిక్కింది. గత కొద్దిరోజులుగా మృగవాని పార్క్ ఓ గ్రే హౌండ్స్ ప్రాంతాల్లో చిరుత సంచరించిన విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం చిరుతను చూసిన గ్రేహౌండ్స్ గస్తీ పోలీసులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఎనిమిది ట్రాప్ కెమెరాలు ఓ నాలుగు బోన్లను ఏర్పాటు చేసి ఎట్టకేలకు చిరుతను అటవీశాఖ అధికారులు బంధించారు. తరువాత చిరుతను జూ పార్కు తరలించారు.

## ట్రాక్టర్ నుంచి

## పడి మహిళ మృతి

మంచిర్యాల నెన్నెల మండలం, లంబడి తండాకు చెందిన దరావత్ తులసి (32) బెల్లంపల్లికి వెళ్తున్న లోడుతో ఉన్న ఇసుక ట్రాక్టర్ పై నుంచి జారి పడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది.నెన్నెలలో బ్యాంక్ పని కోసం బయలుదేరిన తులసి, ఖర్జీ నుండి బెల్లంపల్లికి ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ను లిఫ్టు అడిగి ఇంజన్ కు ట్రాలీకి మధ్యలో ఉన్న రాడ్డుపై నిలబడింది. నెన్నెల మూలమలుపు వద్ద అదుపు తప్పి జారి పడిన మహిళ, ట్రాలీ టైరు కింద పడి మరణించింది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు చొరవ

## ఏఐతో సర్కారీ స్కూళ్లలో పాఠాలు

కరీంనగర్, జూలై 31, తెలంగాణా రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా ఆందోల్, నారాయణపేట, మద్దూర్ గ్రామాలతో పాటు.. పెద్దపెల్లి జిల్లాలోని ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ వంటి గ్రామాలు ఇప్పుడు ఇంటర్నెట్ విప్లవానికి కేరాఫ్ గా నిలుస్తున్నాయి. అయితే ఇంకొన్ని అడుగులు ముందుకేసి.. పట్టణాలు, నగరాల్లోని ప్రైవేట్, కార్పోరేట్ విద్యార్థులు కూడా ఇంకా అందుకోలేని ఆర్టిఫిషియల్ పాఠాలను వింటున్నాయి. ఈ ప్రాజెక్టును ఐటీ మంత్రి శ్రీధర్ బాబు చొరవతో.. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా అటు సంగారెడ్డి, ఇటు పెద్దపెల్లి జిల్లాల్లో తొలుత ప్రారంభించింది. హైదరాబాద్ నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవి శ్రీరాంపూర్ లో 1200 కుటుంబాలుండగా.. ఇప్పటికే 900 ఇళ్లకు టీ ఫైబర్ సేవలందుతున్నాయి. గత ఏడాది 2024, డిసెంబర్ 8వ తేదీనే మంత్రి శ్రీధర్ బాబు ఈ కార్యక్రమాన్ని వర్చువల్ గా ప్రారంభించారు.గత ఏడాది నుంచే ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ టీ ఫైబర్ ద్వారా నిరంతరం శరవేగంతో కూడిన ఇంటర్నెట్ సేవలు ప్రారంభమయ్యాయి. దీంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు టీ ఫైబర్ ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. ఇందుకోసం మూడు డిజిటల్ బోర్డ్స్ తో పాటు, రెండు కంప్యూటర్ మానిటర్స్ ను ఏర్పాటు చేశారు. ఇప్పుడిక్కడ విద్య వీటి ద్వారానే డిజిటల్ మాధ్యమంలో కొనసాగుతోంది. ఇప్పుడు గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్స్ తో పాటు, పర్ప్లెక్సిటీ ఏఐ టూల్ ను కూడా వాడుతున్నారు ఇక్కడి విద్యార్థులు. వాయిస్ మోడ్ లో తమకున్న సందేహాలు, ప్రశ్నలడిగి నివృత్తి చేసుకుంటున్నారు. వీటికి తోడు తెలంగాణా స్కూల్ యాప్ లోకి ఎంటరై పాఠాలకు సంబంధించిన ఇంటరాక్ట్ వీడియోలు చూస్తూ మూస పద్ధతులకు భిన్నంగా విప్లవాత్మక శైలిలో సాగుతోంది అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాల విద్య.గతంలో ఇంటర్నెట్ సిగ్నల్సే దొరకని కాలం నుంచి ఇప్పుడు శరవేగంగా బ్రౌజింగ్ కు ఆస్కారమేర్పడ్డ ఇంటర్నెట్ ను ఒక సానుకూల దృక్పథంతో ఇక్కడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వినియోగిస్తూ మిగిలిన ప్రపంచానికి భిన్నంగా నిలుస్తున్నారు. టీ ఫైబర్ సాయంతో హై స్పీడ్ ఇంటర్నెట్ రావడంతో ఇప్పుడీ గ్రామంలో కేబుల్ కనెక్షన్స్ కూడా తగ్గిపోయి. టీవీలు కూడా ఓటీటీలపైనే నడుస్తున్నాయి. ఇక ఇక్కడి నుంచి సాఫ్ట్వేర్ ఉద్యోగులుగా ఎదిగినవారెవరైనా ఇంటికి వచ్చినప్పుడు వర్క్ ఫ్రమ్ హోం చేసుకోవడానికీ ఇక్కడ ఏర్పాటు చేసిన హై స్పీడ్ టీ ఫైబర్ ఇంటర్నెట్ ఎంతో ఉపయోగపడుతోంది. మంత్రి శ్రీధర్ బాబు చొరవతోనే తమ గ్రామం ఇంటర్నెట్ విప్లవాన్ని చూసిందంటున్నారు స్థానికులు. ప్రస్తుతం ఆర్నెల్ల వరకూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఉచితంగానే టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ అందిస్తారు. ఆ తర్వాత బిల్లు చెల్లించే విధానాన్ని తీసుకురానున్నారు. మొత్తంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రాజ్యమేలుతున్న కాలాన.. గ్రామాలు, పట్టణాల్లో ఇంకా రావాల్సిన మార్పులకు ఓ నిలువెత్తు సాక్ష్యంలా ఇప్పుడు అడవి శ్రీరాంపూర్ నిలుస్తోంది.

## రామచంద్రరావు తన మార్క్ చూపిస్తారా?

హైదరాబాద్, జూలై 31,తెలంగాణ బీజేపీలో సంప్రదాయంగా కొనసాగుతున్న పాత నేతల పెత్తనం పోగొట్టి ప్రక్షాళన చేయడం సాధ్యమేనా..? ఇప్పటికైనా పార్టీలో చేరుతున్న ముఖ్య నేతలతో కొత్త కమిటీలు వేస్తారా..? లేక ప్రస్తుతమున్న కమిటీలనే కొనసాగిస్తారా..? కనీసం కమిటీల్లోనైనా కొత్త నేతలకు అవకాశం ఇస్తారా..? లేక కొత్త నేతలు పనికి రారని పాత వారితోనే బండి నడిపిస్తారా? అసలు టీ బీజేపీలో నూతన అధ్యక్షుడు రామచంద్రరావు మార్క్ ఎలా ఉండబోతుంది..? తెలంగాణ బీజేపీ ప్రక్షాళన దిశగా అడుగులు. తెలంగాణ బీజేపీలో ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయంటున్నారు. ప్రస్తుతమున్న కార్యవర్గంలో కీలక మార్పులు చోటు చేసుకోబోతున్నాయన్న టాక్ వినిపిస్తోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో అతి త్వరలో నూతన కార్యవర్గం ఏర్పాటు కాబోతుందన్న ప్రచారం ఊపందుకుంటోంది. అందుకు రాష్ట్ర బీజేపీ పెద్దలు పెద్దఎత్తున కసరత్తు చేస్తున్నారంట. ఆ క్రమంలో కొత్త కార్యవర్గం కూర్పు ఎలా ఉండబోతుందా అన ఆ పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. స్టేట్ చీఫ్‌ని ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు. కొత్త కమిటీల ఏర్పాటు అంశం తెరపైకి రావడంతో ఆశావహులు స్టేట్ చీఫ్ ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. జిల్లా, రాష్ట్ర కమిటీలో స్థానం కోసం ఆశావహులు క్రమంగా పెరుగుతుండటంతో తమకు అవకాశం వస్తుందో..? లేదోననే ఉత్కంఠ నేతల్లో మొదలైంది. కనీసం కమిటీల్లో అయినా కొత్త నేతలకు అవకాశం కల్పిస్తారా..? లేక మొండిచేయి చూపుతారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ పార్టీకి విధేయుడిగా ఉన్న రామచంద్రరావుకు అధిష్టాన పెద్దలు పట్టం కట్టారు. మరి నూతనంగా ఏర్పాటు కాబోతున్న కమిటీల్లో ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.. కమిటీల్లో తమ మార్క్ చూపించుకున్న కిషన్, సంజయ్. అధ్యక్షుడిగా బండి సంజయ్ తప్పించిన అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పార్టీ పగ్గాలు అప్పగించారు. కిషన్ రెడ్డి వచ్చాక కమిటీలో పలు మార్పులు జరిగాయి. బండి సంజయ్ ముద్రపడిన పలువురిని తప్పించి కిషన్ రెడ్డి తన టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నారనే ప్రచారం జోరుగా జరిగింది. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు కమిటీల్లో తమ మార్క్ చూపించారని గతంలో చెప్పుకున్నారు. మరి ఈ కొత్త కార్యవర్గం అంశంలో రామచంద్రరావు తన మార్క్ చూపిస్తారా? లేదా..? అనేది సస్పెన్స్ గా మారింది. అయితే స్టేట్ చీఫ్‌గా పార్టీలోని పాత నేతకు అవకాశం ఇవ్వడంతో ఇప్పటికే రచ్చ పీక్ స్టేజీకి చేరుకుంది. కొత్త వారికి అవకాశం కల్పించాలంటున్న నేతలు. కనీసం కమిటీలోనైనా కొత్త వారికి అవకాశం కల్పించాలని వలస నాయకులు ఆశిస్తున్నారు. పార్టీ బలోపేతం అవ్వాలన్నా, పార్టీలో చేరికలు పెరగాలన్నా కొత్త వారికి అవకాశం ఇవ్వాలని పలువురు చెబుతున్నారు. అంతేకాదు కొత్త నేతలను బుజ్జగించేందుకయినా కమిటీల్లో చోటు కల్పిస్తారని పలువురు భావిస్తున్నారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్ర పార్టీ స్పష్టంగా పార్టీ పదవులు పాత వారికేననే ధోరణితో ఉందంట. పాత వారయితేనే పార్టీ మరింత బలోపేతమవుతుందని, చేరికలు సైతం పెరుగుతాయన్న అంచనాల్లో కమలం పార్టీ ఉన్నట్లు సమాచారం. కొత్త వారికి రాజకీయ పదవుల్లో మాత్రం అవకాశం కల్పించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు చేస్తున్న కాషాయనేతలు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు కాషాయ పార్టీ ఇప్పటినుంచే వ్యూహాలకు పదును పెడుతోంది. అందుకు అనుగుణంగా కమిటీలను సిద్ధం చేయాలని ప్లాన్ చేస్తోంది. అంతేకాదు త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా పార్టీ కసరత్తును ముమ్మరం చేస్తోంది. ఇతర పార్టీల కంటే ఒకడుగు ముందంజలోనే ఉండాలని పట్టుదలతో ఉంది. అందుకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలకు వర్క్ షాప్, శిక్షణ తరగతులతో దిశానిర్దేశం చేయాలని చూస్తోంది. అందులో భాగంగానే ఇటు కార్యవర్గాల కమిటీ నియామకం, అటు స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ఆశావహులు నూతన అధ్యక్షుడిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారంట.

### చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలో మొసలి సంచారం

హైదరాబాద్ చైతన్యపురి డివిజన్లోని ఫణిగిరి కాలనీలో మూసి నది పక్కన ఒక పెద్ద మొసలి సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మీడియా ద్వారా తెలియజేశారు. ఈ నెల 3వ తారీఖున బోనాల పండుగ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలు మొసలి సంచరిస్తున్న ప్రదేశానికి రావద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వానికి, అటవీ శాఖ అధికారులకు మొసలి ని పట్టుకోవడంలో త్వరిత చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సూచించారు.

# అజారుద్దీన్ కే అవకాశం



హైదరాబాద్, జూలై 31, హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది హాట్ టాఫిక్‌గా మారింది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో ఇక్కడ బైపోల్ రాగా.. అధికార కాంగ్రెస్ నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయం ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ అభ్యర్థి ఎంపికపై ఓ క్లారిటీ ఇచ్చారు. స్థానిక వ్యక్తికే టికెట్ ఇస్తామని ప్రకటించారు.ఈ ఉప ఎన్నికకు కాంగ్రెస్ నుంచి పలువురి పేర్లు చర్చల్లో ఉన్నాయి. గతంలో ఇదే స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన భారత మాజీ క్రికెటర్, సీనియర్ కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్ , దివంగత నేత పీజేఆర్ కూతురు విజయారెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన రోహిన్‌రెడ్డి, నవీన్ యాదవ్, నాంపల్లి నుంచి పోటీ చేసి ఓడిపిపోయిన ఫిరోజ్ ఖాన్ తదితరులు రేసులో ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్ మైనారిటీ ప్రతినిధులు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ను కలిశారు. కేబినెట్‌లో మైనారిటీలకు ప్రాతినిధ్యం లేనందున.. కనీసం ఈ ఉప ఎన్నిక టికెట్‌ను తమ వర్గానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో వారు అజారుద్దీన్ పేరును బలంగా బలపరిచినట్లు సమాచారం.ఈ విజ్ఞప్తిని పీసీసీ చీఫ్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా.. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అజారుద్దీన్ వైపే అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌లు సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తున్నట్లు తెలిసింది. అభ్యర్థిగా అజారుద్దీన్ పేరును ఫిక్స్ అయ్యారని.. అధికారికంగా ప్రకటించటం ఒక్కటే మిగిలి ఉందని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాగా, ఈ నిర్ణయంపై ఫిరోజ్ ఖాన్ అసహనం వ్యక్తం చేశారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. గెలిచే వారికే అవకాశం ఇవ్వాలని అన్నారు. స్థానికులకే టికెట్ ఇస్తామనటం సరికాదన్నారు. రాహుల్, ప్రియాంక ఎక్కడ్నుంచి ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారో ఓసారి తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.కాగా, ఈ ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలాన్ని చూపించడానికి, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇది ఒక బలమైన సంకేతంగా కాంగ్రెస్ భావిస్తుంది. ఈ ఉప ఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుందని.. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తోంది. బీజేపీ సైతం జూబ్లీహిల్స్ బైపోల్‌లో విజయం సాధించి సత్తా చాటాలని ఉవ్విలూరుతోంది.

# దేశ సరిహద్దులు తలపించిన నెల్లూరు

## జగన్ పర్యటన నేపథ్యంలో అడుగడుగునా పోలీసులు పహారాలు..

## ముళ్ల కంచలు.. బారికేట్లతో తనిఖీలు

నెల్లూరు మాజీ ముఖ్యమంత్రి జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా అడుగడుగునా పోలీసు నిఘా, ముళ్లకంచెలు,బారికేడ్లు, ప్రత్యేక పోలీసు బృందాలతో చెక్ పోస్టులు ఏర్పాటు చేసారు. రెండు నెలలుగా జిల్లా కేంద్ర కారాగారం లో ఉన్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితో జగ్ ములాఖాత్, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటికి వెళ్ళనున్నారు ఈ నేపథ్యంలో జగన్ చూసేందుకు భారీ ఎత్తున అభిమానులు పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉండడంతో పోలీసులు వారిని అడ్డుకునేందుకు భారీ ఎత్తున పోలీసు బలగాలను మొహరించారు జిల్లాలో ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో జన సమీకరణ చేయొద్దు జగన్ పర్యటనకు ప్రజలకు ఎటువంటి అనుమతి లేదని అలా కాదుని ఎవరైనా జగన్ ను చూడాలని వచ్చినా బైక్ ర్యాలీలు చేసినా పోస్టర్లు బ్యానర్లు లాంటివి ప్రదర్శించినా కఠినంగా వ్యవహరిస్తామని కేసులు నమోదు చేస్తామని నోటీసులు జారీచేశారు, ఇప్పటికే నెల్లూరు నగరం లో ప్రవేశించే అన్ని మార్గాల వద్ద పోలీస్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి బయట వ్యక్తుల వాళ్ళు నగరంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారు, నగరంలో కూడా పలు కూడళ్ళు వద్ద బారికేడ్లు పెట్టి ముళ్ళ కంచ ఏర్పాట్లు చేశారు...

# సిగాచీ పరిశ్రమ అడగడుగునా నిర్లక్ష్యం

మెదక్, జూలై 31, సంగారెడ్డి జిల్లాలో జరిగిన సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో యాభై ఆరు మంది కార్మికులు చనిపోయారు. ఇందులో 46 మంది కార్మికులకు సంబంధించిన మృతదేహాలు, అవశేషాలు దొరకగా, మరో ఎనిమిది మందికి సంబంధించిన ఆనవాళ్లు కూడా లభించలేదు. సిగాచీ పరిశ్రమ యాజమాన్యంతో పాటు ప్రభుత్వం కూడా ఆ ఎనిమిది మంది చనిపోయి ఉంటారని ప్రకటించింది. అయితే సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా ఉత్తర్ ప్రదేశ్, బీహార్, ఒడిశాకు చెందిన కార్మికులు కూడా ఉన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాదస్థలాన్ని సందర్శించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియో చెల్లించాలని కోరారు.అందుకు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం కూడా అంగీకరించి తాము కోటి రూపాయలు మృతి చెందిన వారి కుటుంబాలకు చెల్లిస్తామని, గాయపడిన వారికి ఉచితంగా తమ పరిశ్రమ తరుపున వైద్యసాయం అందిస్తామని చెప్పింది. అయితే ఇప్పటి వరకూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం కోటి రూపాయల పరిహారం చెల్లించలేదు. అయితే కొందరికి మాత్రం పదిహేను లక్షల రూపాయలు మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆచూకీ లభించని ఎనిమిది మందికి సంబంధించిన వారికి డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదు. ప్రమాదం జరిగి నెల రోజులవుతున్నా ఇంతవరకూ పరిహారం చెల్లించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఇటు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోవడం లేదని, అటు ప్రభుత్వం కూడా ప్రమాదం జరిగి ఇన్ని రోజులవుతుండటంతో దాని ఊసే మరిచిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిగాచీ పరిశ్రమ ప్రమాదంపై ఏర్పాటయిన నిపుణుల కమిటీ ఇప్పటి వరకూ ప్రభుత్వానికి నివేదిక అందచేయలేదు. ప్రమాదానికి గల కారణం పాత మిషనరీ అని కార్మికులు చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకూ సిగాచీ పరిశ్రమ యాజమాన్యానికి సంబంధించి ఈ ఘటనలో ఎవరినీ అరెస్ట్ చేయకపోవడంపై విపక్షాలు సయితం ప్రశ్నిస్తున్నాయి. పైగా మృతి చెందిన కార్మికుల కుటుంబాలలో కొందరికి పదిహేను లక్షలు ఇచ్చి వారిచేత అగ్రిమెంట్లపై సంతకం కూడా సిగాచీ పరిశ్రమ యాజమాన్యం పెట్టించుకుందని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని కార్మికుల కుటుంబాలు కోరతున్నాయి. ప్రమాదంలో గాయపడిన వారు కోలుకుంటున్నారు. మూడు నెలల పాటు పరిశ్రమను మూసివేస్తున్నట్లు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. అయితే గాయపడిన వారికి ఇంత వరకూ వారు కుటుంబాలు ఎలా జీవనం సాగిస్తారన్న దానిపై కూడా యాజమాన్యం క్లారిటీ ఇవ్వలేదు. ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావిడి చేసి తామే అంతా చూసుకుంటామన్న సిగాచీ పరిశ్రమ యాజమాన్యం తర్వాత మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదన్నవిమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. యాజమాన్యం తప్పుకు కార్మికుల కుటుంబాలు బలవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికుల కుటుంబాలకున్యాయం చేయాలని కోరుతున్నారు.

# బీసి రిజర్వేషన్లు... ఓవర్ టూ ఢిల్లీ

హైదరాబాద్, జూలై 31, రేపటి స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభావితం చేసే బీసీ రిజర్వేషన్ పైనే అందరి దృష్టి కేంద్రీకరించబడి ఉంది. ఈ విషయంలో ఏ పార్టీ ఏవిధంగా స్పందిస్తున్నారు అనే విషయాలపై బీసీ వర్గాలు సునిశితంగా పరిశీలిస్తున్నారు. అయితే

ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఏవిధంగా స్పందించాలని విషయంలో కొన్ని రాజకీయ పక్షాలు ఇంకా మల్లగుల్లపడుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ లో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదానికి పంపింది. అయితే ఈ విషయంలో బిల్లుకు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీజేపీ అనుకూలంగా లేనట్లు కనిపిస్తున్న తరుణంలో రాష్ట్రపతి ఆమోదముద్ర కు సమయం పడే అవకాశముంది. దీంతో ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసి గవర్నర్ కు పంపి తమ చిత్తశుద్ధి చాటుకున్నారు. అయితే బీసీ రిజర్వేషన్ల కు వ్యతిరేకం కాదని ఒకవైపు ప్రకటిస్తూనే, మరోవైపు ఈబీసీ రిజర్వేషన్ల బిల్లులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించినందుకు బీజేపీ అడ్డుతుగులున్నట్లు స్పష్టమౌతుంది. అయితే ఈ బిల్లు విషయంలో బిఆర్ఎస్ పార్టీ మాత్రం ఇంకా డైలమాలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఎలాగైనా బీజేపీ ఈ బిల్లు సమర్థించదని తెలిసి కూడా కాంగ్రెస్ బిల్లు ప్రవేశపెట్టిందని, ఆ పార్టీకి రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ అధినాయకులు విమర్శలకు పరిమితమయ్యారు.అయితే కేసీఆర్ కూతురు కవితక్క మాత్రం ఈ బిల్లును స్వాగతిస్తూ, సంబరాలు చేసుకోవడంతో తన రాజకీయ పరిణతిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన విధిని తాను నిర్వర్తించిందని, బిల్లు ను సమర్థిస్తూ ప్రకటన చేయడంలో తప్పేమీ లేదని ఆమె తన వైఖరి స్పష్టం చేశారు. ఏదీ ఏమైనా బీసీ లకు మద్దతుగా బిల్లు ఆమోదిస్తే దాన్ని వ్యతిరేకించడం వారి నుంచి పార్టీ దూరం కావడమేనని ఆమె భావించినట్లున్నారు. అందుకే ఎలాంటి భేషజాలు లేకుండా సమర్థించారు. ఎలాగోలా ఈ అవకాశం వచ్చినా అందిపుచ్చుకోవడం తెలుసుకున్న కవిత, ఈ విషయంలో పార్టీ తీసుకున్న స్టాండ్ కు వ్యతిరేకంగా స్పష్టమైన ప్రకటన చేస్తూ కేటీఆర్ కన్నా తనకు రాజకీయాలపై ఎక్కువ అవగాహన ఉందని మరోసారి చాటి చెప్పారు. కానీ ఈ విషయంలో బిఆర్ఎస్ మాత్రం ఏవిధంగా స్పందించాలని మీమాంసలో కొట్టుమిట్టాడుతునే ఉన్నారు.అయితే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుగా మరో అడుగు ముందుకు వేసేందుకు సిద్ధమైంది. బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందేందుకు కొంత సమయం పట్టినా, ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదముద్ర వేసేందుకు తాత్సారం చేసినా తమ పార్టీ మాత్రం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం కు అనుగుణంగా బీసీ అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చి రంగంలోకి దింపుతామని ఇదివరకే ప్రకటించడం బిఆర్ఎస్ నేతలకు మింగుడుపడడం లేదు. కనీసం బిల్లు విషయం పక్కనబెట్టి తమ పార్టీ కూడా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించేందుకు సైతం అధైర్యం చేయడం లేదు. ఈ విషయంలో పార్టీ జిల్లా, మండల స్థాయి బీసీ నాయకులు పార్టీ నేతలపై ఒత్తిడి తెస్తున్నా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వాన్ని కోల్పోయి, ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలుచుకోలేక, ఎంఎల్సీకి పోటీ కూడా చేయలేని పరిస్థితుల్లో ఉన్న బిఆర్ఎస్ పార్టీ మరోవైపు ట్యాపింగ్, కార్ రేస్, కాళేశ్వరం తో పాటు మరెన్నో కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న ఈ సమయంలో కనీసం కిందిస్తాయి కేడర్ ను నిలుపుకునేందుకు అవకాశమున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో త అభ్యర్థులను గెలిపించుకునే ప్రయత్నాల్లో భాగంగా కార్యక్రమాలు రూపకల్పన చేసుకుంటున్నారు. కానీ ప్రధానమైన బీసీ నినాదం స్తానిక ఎన్నికలను ప్రభావితం చేస్తుందని, ఈ విషయంలో తాము పార్టీ పరంగా 42 శాతం లేక ఇంకా ఎక్కువగా రిజర్వేషన్ బీసీలకు ఇస్తామని ప్రకించే విషయంలో ఆ పార్టీ నేతలు సంశయిస్తున్నారు. బీసీ లను మోసం చేసేందుకు కాంగ్రెస్ బీసీ బిల్లు, ఆర్డినెన్స్ చేస్తున్నారని విమర్శలకే పరిమితమవుతున్నారు.నామినేటెడ్ పదవుల్లో కూడా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే బీసీ నాయకులకు పెద్దపీట వేసేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొన్ని నియోజకవర్గాల్లో ఓసీ స్థానాలకు కేటాయించిన నామినేటెడ్ పదవులను బీసీ లకుకేటాయించే విషయంలో ముందుచూపు ప్రదర్శించింది. రాష్ట్రంలో నిర్ణయాత్మకమైన ఓటు కలిగి ఉన్న బీసీ లకు ప్రాధాన్యత ఇచ్చే విషయంలో కాంగ్రెస్ వడివడిగా అడుగులు వేస్తున్న ఈ సమయంలో ఇంటిపోరుతో ఇబ్బందులు పడుతున్న బిఆర్ఎస్ భవితవ్యంపై ఆ పార్టీలోని నాయకులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎవ్వరూ తగ్గేదేలే అన్నట్లున్నారు..! బిల్లు ఆమోదం కోసం ఎందాకైనా వెళ్తామంటోంది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆగస్ట్ 5 నుంచి 7 వరకు ఢిల్లీ వేదికగా రేవంత్ బృందం కార్యాచరణ అమలు చేయనుంది. సామ-దాన-భేద దండోపాయం ద్వారా బీసీ రిజర్వేషన్లను సాధిస్తామంటున్నారు ప్రభుత్వ పెద్దలు.మీరేంటి బీసీల కోసం పోరాడేది.. అసలు పోరాటమంటే ఏంటో చూపిస్తామంటోంది బీఆర్ఎస్. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రపతిని కలుస్తామంటున్నారు కారుపార్టీ నేతలు. ఢిల్లీ రావాలని కేసీఆర్‌ను నేతలు కోరగా.. సరే వెళ్లి కలుద్దామని చెప్పినట్లు తెలుస్తోంది. ఆతర్వాత కూడా ఫలితం లేకపోతే.. మున్ముందు ఇంకాస్త దూకుడుగా ముందుకెళ్తామంటున్నారు నేతలు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలాడుతోందని.. దమ్ముంటే కార్పొరేషన్ చైర్మన్లు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.ఇటు బీజేపీ నేతలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు. అది ఃఅ బిల్లు కాదు.. ముస్లిం రిజర్వేషన్ బిల్లు అంటున్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముస్లింలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్లను తొలగిస్తేనే బిల్లుకు మద్దతిస్తామంటున్నారు.ఎమ్మెల్సీ కవిత సైతం బీసీ బిల్లు సాధన కోసం పోరుకు సిద్ధమయ్యారు. ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటల దీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్న అర్డినెన్స్ అంశంపై ప్రభుత్వం సుప్రీంకోర్టు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలన్నారు కవిత.మొత్తంగా? ఓవర్ టు ఢిల్లీ అంటున్నాయి తెలంగాణలోని పొలిటికల్ పార్టీలు. మరి పార్టీల ఒత్తిడితో కేంద్రం దిగొస్తుందా..? బిల్లుకు ఆమోదం తెలుపుతుందా..? అన్నది చూడాలి.

# ముద్రా పేరుతో మాయ...

కరీంనగర్, జూలై 31, ముద్ర అగ్రికల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ తిప్పనేని రామదాసప్పను తెలంగాణ సీఐడీ అధికారులు అమరావతిలో అరెస్టు చేశారు. రైతులు, నిరుద్యోగులు,రోజువారీ కూలీలను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో 2 మంది బాధితుల నుంచి రూ.140 కోట్లు వసూలు చేసిన కేసులో రామదాసప్పతో పాటు ఆయన కుమారుడు తిప్పేనేని సాయి కిరణ్‌ను హైదరాబాద్ లో అదుపులోకి తీసుకున్నారు.సీఐడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 2 వేల మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిందితులు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఆ ప్రకటనలు చూసిన పలువురు నిరుద్యోగులు రెండు రాష్ట్రాలకు చెందిన పలువురు బాధితులు వారిని సంప్రదించారు. వారి బలహీనతను అసరా చేసుకున్న నిందితులు వారి వద్ద పెద్ద మొత్తాల్లో నగదు వసూలు చేశారు. అనంతరం వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పి రైతుల నుంచి పెట్టుబడులకు ఉసికొల్పారు. వారినుంచి పెట్టుబడులు తేకుంటే మీ జీతం నుంచి తీసుకుంటానని, సర్టిపికెట్లు ఇవ్వనని వేధించాడు. ఈ విషయమై తెలంగాణ, ఏపీలలో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగాఈ విషయమై తీగలాగితే పెద్ద డొంక కదిలింది. ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో కోట్లు కొల్లగొట్టినట్లు తేలడంతో కేసును సీఐడీకి అప్పగించారు. విచారణ జరిపిన సీఐడీ ఇద్దరినీ అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది.కేంద్రప్రభుత్వ ప్రధాన మంత్రి ముద్ర యోజన పేరుతో రామదాసప్ప నాయుడు సహకార సంఘాన్ని స్థాపించాడు. ఇది ప్రభుత్వ సంస్థ అని నమ్మించాడు. ఈ సంఘంలో పెట్టుబడి పెడితే డిపాజిట్లపై అధిక వడ్డీని ఇస్తానని, సభ్యులుగా చేరిన వారికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను ఇస్తానని హామీ ఇచ్చాడు. సొసైటీని త్వరలో ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకుగా మారుస్తామని కూడా అతను చెప్పాడు. ఈ హామీలు, ముఖ్యంగా వార్తపత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లో 2,000 'ప్రభుత్వ మార్కెటింగ్ సూపర్‌వైజర్' ఉద్యోగాలను ఇస్తామని మభ్య పెట్టాడు. దీనికోసం1,600 మంది ఉద్యోగులను నియమించుకున్నాడు. ఆ సమయంలో వారి ఒరిజనల్ సర్టిఫికెట్లను కూడా తీసుకున్నారు.బాధితులను వాటా మూలధనం , పెట్టుబడి బాండ్లను కొనుగోలు చేసే నెపంతో డబ్బు డిపాజిట్ చేయమని కోరారు.ఇక రైతులు, చిన్నవ్యాపారుల నుంచి డిపాజిట్లు సేకరించాలని మార్కెటింగ్ సూపర్‌వైజర్లుగా నియమించబడిన ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు. డిపాజిట్ లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన ఫలితంగా ఉద్యోగుల జీతాల నుండి కోతలు విధించారు. అయితే ఉద్యోగం నచ్చక రాజీనామా చేసిన వారికి వారి సర్టిఫికెట్లు, రిటర్న్‌లను ఇవ్వడానికి నిరాకరించారు. కాగా ప్రజల నుండి వసూలు చేసిన పెద్ద మొత్తాలను ఆంధ్రప్రదేశ్‌లోని లిమిటెడ్ ద్వారా పారిశ్రామిక ప్లాట్లను కొనుగోలు చేయడానికి మళ్లించారని దర్యాప్తులో తేలింది. మోసపూరిత సొసైటీ సుమారు 330 శాఖలను తెరిచి 2,000 మందికి పైగా బాధితులను మోసం చేసిందని భావిస్తున్నారు.కాగా బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ అంతటా నల్లకుంట, కాచిగూడ, గంభీరావుపేట, రామాయంపేట, దుబ్బాక, వేములవాడ, అచ్చంపేట, ఆత్మకూర్ సహా వివిధ పోలీస్ స్టేషన్లలో నిందితులపై కేసులు నమోదయ్యాయి. ఐపీసీ సెక్షన్లు 406 (నేరపూరిత నమ్మక ద్రోహం), 420 (మోసం), 506 (నేరపూరిత బెదిరింపు), 409 (ప్రభుత్వ ఉద్యోగి లేదా బ్యాంకర్ ద్వారా నేరపూరిత నమ్మక ద్రోహం), మరియు తెలంగాణ ఆర్థిక సంస్థల డిపాజిట్ల రక్షణ చట్టం, 1999 లోని సంబంధిత నిబంధనల కింద నమోదు చేశారు. కాగా. సేకరించిన నిధులను ఎక్కడికి తరలించారు. ఇతర లబ్ధిదారులు ఎవరు? అనే కోణంలో సీఐడీ దర్యాప్తు జరుపుతోంది



# వస్తానంటున్న ... రాజాసింగ్

హైదరాబాద్, జూలై 31, ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి వార్తల్లో నిలిచిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వరుసగా స్వామీజీలను దర్శించుకుంటున్నారు. ఈ రోజు శంఖేశ్వర్ భవన్‌లో కొలువైన పూజ్య ఆచార్య శ్రీ సూరీశ్వర్జీ మహారాజ్ ను దర్శించుకున్నారు. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాష్ట్ర-సంత్ శ్రీ లలితప్రభ జీ, శ్రీ చంద్రప్రభ జీని సైతం దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. వీరి ఆశీర్వాదంతో సమాజం, దేశ సేవ చేయాలనే తన సంకల్పానికి మరింత శక్తి లభిస్తుందన్నారు. ఈ వివరాలను రాజాసింగ్ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. అయితే.. రాజాసింగ్ వరుసగా స్వామీజీలను కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటుండడం హాట్ టాపిక్ గా మారింది. బీజేపీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన ఏ పార్టీలోనూ ఇంత వరకు చేరలేదు. భవిష్యత్ కార్యాచరణపై ఆయన త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తారని.. ఈ నేపథ్యంలోనే స్వామీజీలను కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారన్న చర్చ సాగుతోంది. 2014, 18, 23 ఎన్నికల్లో బీజేపీ నుంచి గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల బరిలో దిగిన రాజాసింగ్ హ్యాట్రిక్ విజయాలు అందుకున్నారు. 2018-23 మధ్య ఆయన ఓ సారి పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఓ వర్గంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న విమర్శల నేపథ్యంలో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. సస్పెన్షన్ ఎత్తివేసి మళ్లీ గోషామహల్ నుంచి పార్టీ అభ్యర్థిగా బరిలోకి దించింది బీజేపీ. ఆ ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. బీజేపీ నుంచి 2023లో తెలంగాణలో గెలిచిన ఎమ్మెల్యేలందరిలో రాజాసింగ్ మాత్రమే పార్టీలో సీనియర్. అత్యధిక సార్లు ఎమ్మెల్యేగా గెలిచింది కూడా ఆయనే. ఈ నేపథ్యంలో బీజేపీ శాసనసభా పక్ష నేత పదవి తనకు ఖాయమని రాజాసింగ్ భావించారు. కానీ పార్టీ హైకమాండ్ మాత్రం మహేశ్వరరెడ్డికి అవకాశం ఇచ్చింది. అనంతరం వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగాలని ఆశించారు. కానీ మాధవిలతను అక్కడి నుంచి పోటీకి దించింది బీజేపీ హైకమాండ్. ఈ రెండు విషయాల్లో తీవ్ర మనస్థాపానికి గురైన రాజాసింగ్.. పార్టీ పెద్దలను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తూ వచ్చారు.ముఖ్యంగా రాష్ట్రంలో అగ్రనేతలు అని చెప్పుకునే వారే పార్టీ ఎదగకపోవడానికి కారణమని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో పార్టీ అధ్యక్షుడిగా రామ్ చందర్ రావును నియమించిన రోజే ఆయన రాజీనామా చేశారు. అయితే.. పార్టీ రాష్ట్ర నేతలపై దుమ్మెత్తి పోస్తున్న రాజాసింగ్.. మోదీ, అమిత్ షాలపై మాత్రం పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. దీంతో ఆయన మళ్లీ బీజేపీలోకి ఎంట్రి ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ కూడా సాగుతోంది.

# దోమల కట్టడి పై జిహెచ్ఎంసి ఫోకస్

## నగరంలో ముమ్మరంగా యాంటి లార్వా ఆపరేషన్లు దోమల నిర్మూలన కార్యక్రమాలను పర్యవేక్షణ చేస్తున్న కమిషనర్ సత్ఫలితాలను ఇస్తున్న బల్దియా చర్యలు



**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: జులై 31:** బల్దియా కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాల మేరకు నగర ప్రజలను దోమల బాధ నుండి రక్షించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ముమ్మరంగా యాంటీ లార్వా ఆపరేషన్ల ఫోకస్ పెట్టింది ఒక్క జులై నెలలో 15, 500 కు పైగా కాలనీలల్లో దోమల నివారణకు యాంటి లార్వా ఆపరేషన్ లు చేపట్టింది. అంతేకాకుండా దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు సంబంధిత కరపత్రాలను ఇంటింటికి వెళ్లి జిహెచ్ఎంసి పంపిణీ చేస్తుంది.

యాంటి లార్వా ఆపరేషన్ లలో వేలాది మంది సిబ్బంది పాల్గొంటుండగా ఇప్పటివరకు 34 లక్షల 45 వేల 357 ఇండ్లను రెండు మూడు సార్లు రిపీట్ గా తనిఖీ చేయగా లార్వా తో ప్రభావమైన ఇండ్లు 1.5 శాతం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అలాగే ఒక కోటి 10 లక్షల 35 వేల కంటైనర్ల ను తనిఖీ చేయగా 0.5 శాతం కంటైనర్లు ప్రభావితమైనట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మాసంలో 1700 కు పైగా స్కూల్ లలో, 320 కు పైగా కళాశాలలో ఐ ఆర్ ఎస్ స్ప్రే పిల్లలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.పకడ్బందీ ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలకుండా చేపడుతున్న కార్యక్రమాలను కమిషనర్ ఆర్ వి కర్ణన్ ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నారు. లోటుపాట్లను సమీక్షిస్తూ యాంటీ లార్వా ఆపరేషన్లు ప్రభావంతంగా చేపట్టేందుకు అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. బల్దియా క్రమం తప్పకుండా చేపడుతున్న చర్యలు క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. గతం కంటే కీటక జనిత వ్యాధులు తక్కువ నమోదు అయ్యాయి.

# జీహెచ్ఎంసి పురోగతిలో మీ సేవలు మరువలేనివి: అదనపు కమిషనర్ రఘు ప్రసాద్

## పదవీ విరమణ పొందిన 18 మంది జిహెచ్ఎంసి అధికారులు, ఉద్యోగులకు ఆత్మీయ సత్కారం




**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: జులై 31,** 2025: జీహెచ్ఎంసి పురోగతిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలు మరువలేనివని అదనపు కమిషనర్ (హెల్త్ , శానిటేషన్) రఘు ప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన వివిధ స్థాయిలోని 18 మంది అధికారులు, ఉద్యోగులకు అదనపు కమిషనర్ (హెల్త్, శానిటేషన్) రఘు ప్రసాద్, అదనపు కమిషనర్ లు వేణు గోపాల్, గీతా రాధిక, సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా, పిఆర్ఓ మామిండ్ల దశరథం లతో కలిసి శాలువా, పూల దండలతో సత్కరించారు. గిఫ్ట్ లను బహుకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (హెల్త్, శానిటేషన్) రఘు ప్రసాద్ మాట్లాడుతూ... ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రిటైర్మెంట్ అన్నది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి మున్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు.




పదవీ విరమణ పొందిన వారి వివరాలు:

చీఫ్ ఇంజనీర్ (ఎస్.ఎన్.డి.పి) ఎం. కోటేశ్వరరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డి.నరేందర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి.రవీందర్, సూపరింటెండెంట్ బి.స్వామి, గేమ్స్ ఇన్ స్పెక్టర్ ఇంతైజ్ అహ్మద్, హెవి వెహికల్ డ్రైవర్ మల్లయ్య, జూనియర్ అసిస్టెంట్ కె.మోహన్ రాజ్, ఆఫీస్ సబార్డినేట్ డి.నర్సింగ్ రావు, ఛైన్ మెన్ ఎం.యాదయ్య, పి. హెచ్ వర్కర్ కె.ముత్తమ్మ, కామాటి జి.పెంటయ్య, కామాటన్ లు బాలమణి, యాదమ్మ, లక్ష్మీ భాయి, లక్ష్మమ్మ, మాలీ లు కె. ఎల్లయ్య, నర్సింహ్మ.

కార్యక్రమంలో అడిషనల్ ఏ.ఎం.సి లు జీవన్ కుమార్, శారద, ఉన్నత శ్రేణి సహాయకులు రోహిత్ , సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన పోలీస్ అధికారుల సన్మాన మహోత్సవం

కరీంనగర్ గౌస్ బాబా మహాహ్మద్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, రీజనల్ ఇంటలిజెన్స్ అధికారి కాసర్ల మునీందర్ రెడ్డి ఇంటలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ పదవి విరమణ సన్మాన మహోత్సవం నిన్న సాయంత్రం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సన్మాన మహోత్సవానికి హాజరైన టీఎన్జీవో టీ జి ఓ నాయకులు ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చం శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ టి ఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 35 సంవత్సరాలు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి వృత్తినే దైవంగా భావించి పని చేసినారని ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని జీవితంలో ఏదీ శాశ్వతం కాదని పేరు మాత్రమే శాశ్వతంగా ఉంటుందని ఉద్యోగులు గా వీరు చేసిన సేవలు చిరస్మరనీయంగా నిలిచిపోతాయని కొనియాడారు ఈరోజు ప్రజలు క్షేమంగా సంతోషంగా జీవిస్తున్నారంటే పోలీస్ అధికారులు ప్రజా సంక్షేమం కోసం రాత్రనకా పగలనకా ఎండనకా వాననక రాత్రింబవళ్లు కంటిమీద కులుకు లేకుండా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బంధ బస్తులు పికెటింగులు చేస్తూ అసాంఘిక శక్తులను నుంచి అల్లరి మూకల నుంచి కాపాడుతూ ప్రతి విషయాన్ని ఇంటెలిజెన్స్ నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తూ ప్రభుత్వం ప్రజలకు సానుకూల నిర్ణయాలు తీసుకునే విధంగా కృషి చేస్తున్నారన్నారు వీరి విశేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలన్నారుఈ కార్యక్రమంలో ఏసీపీ హుస్నాబాద్ సదానందం ,ఎస్ బి ఎ సి పి శ్రీనివాస్, రిటైర్డ్ ఏసీబీ డిఎస్పి రమణమూర్తి దారం శ్రీనివాసరెడ్డి తోపాటు టి జీవోల జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి ఒంటెల రవీందర్ రెడ్డి గూడ ప్రభాకర్ రెడ్డి గంగారపు రమేష్ మామిడి రమేష్ రాజేశ్వరరావు బల్వీర్ సింగ్ ఇంటెలిజెన్స్ అధికారులు పోలీసు అధికారులు ఉద్యోగులు వారి బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# రోడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా నేడు 416 క్యాచ్ పిట్ ల పూడ్చివేత




**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: జులై 31:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) పరిధిలో రోడ్లపై భద్రత పెంపొందించడంలో భాగంగా రోడ్ సేఫ్టీ డ్రైవ్ను నిర్వహిస్తోంది. గ్రేటర్ పరిధిలోని ఆరు జోన్లలో పాట్ హోల్స్ (%Pot Holes%), క్యాచ్ పిట్స్, సెంట్రల్ మీడియన్ మరమ్మత్తులు తదితర పనులు చేపడుతున్నారు.

జోన్ల వారీగా పనుల వివరాలు:

ఎల్బి నగర్ జోన్ లో మొత్తం క్యాచ్ పిట్స్ 2533 ను గుర్తించగా నిన్నటివరకు 1838 పరిష్కరించబడం జరిగింది. నేడు 80 పరిష్కరించగా, ఇప్పటి వరకు మొత్తం 1918 పరిష్కరించడం జరిగింది.

చార్మినార్ జోన్ మొత్తం క్యాచ్ పిట్స్ 1873 గుర్తించగా, నిన్నటి వరకు 1364 పరిష్కరించబడింది. నేడు 99 పరిష్కరించగా ఇప్పటి వరకు మొత్తం 1463 పరిష్కరించడం జరిగింది.

ఖైరతాబాద్ జోన్ లో మొత్తం క్యాచ్ పిట్స్ 1241 గుర్తించగా, నిన్నటివరకు 779 పరిష్కరించబడింది. నేడు 44 పరిష్కరించగా, ఇప్పటి వరకు మొత్తం 823 పరిష్కరించడం జరిగింది.

శేరిలింగంపల్లి జోన్ లో మొత్తం క్యాచ్ పిట్స్ 1546 గుర్తించగా నిన్నటి వరకు 487 పరిష్కరించబడింది. నేడు 51 పరిష్కరించగా, ఇప్పటి వరకు మొత్తం 538 పరిష్కరించారు.




కూకట్పల్లి జోన్ లో మొత్తం క్యాచ్ పిట్స్ 1381 గుర్తించగా, నిన్నటి వరకు 970 పరిష్కరించబడింది. నేడు 67 పరిష్కరించగా, ఇప్పటి వరకు మొత్తం 1037 పరిష్కరించారు.

సికింద్రాబాద్ జోన్ లో మొత్తం క్యాచ్ పిట్స్ 1808 గుర్తించగా, నిన్నటి వరకు 942 పరిష్కరించబడింది. నేడు 75 పరిష్కరించగా, మొత్తం 1017 పరిష్కరించారు. GHMC పరిధిలో మొత్తం 10,382 క్యాచ్ పిట్స్ గుర్తించగా ఇప్పటివరకు 6796 పరిష్కరించింది. నేడు 416 పరిష్కరించింది.

# పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## మాన్సూన్ స్పెషల్ డ్రైవ్ ను శేరిలింగంపల్లి జోన్లో తనిఖీకి చేసిన GHMC కమిషనర్




**శేరిలింగంపల్లి ప్రజాబలం ప్రతినిధి**

హైదరాబాద్, జులై 31, 2025: వర్షాకాల పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ జీహెచ్ఎంసీ ఆర్ వి కర్ణన్ క్షేత్ర అధికారులు, పారిశుధ్య కార్మికులకు సూచించారు.

గురువారం శేరిలింగంపల్లి జోన్లో ఉదయం వర్షాకాల పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ ఆర్ వి కర్ణన్ జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మొదట కావూరి హిల్స్లో తనిఖీలు చేశారు. కార్మికులతో మాట్లాడారు.

కాలనీలలో పరిశుభ్రత చర్యలు ప్రభావంతంగా చేపట్టాలన్నారు.

డిప్యూటీ కమిషనర్ , స్థానిక అధికారులతో కలిసి పారిశుధ్య పనులను సమీక్షించారు.

తదనంతరం పటాన్ చెరువు ను సందర్శించి కమిషనర్ ఆర్ వి రవీందర్ కర్ణన్ తనిఖీ చేపట్టారు.తనిఖీల సమయంలో ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్లు, యాంటీ-లార్వా స్ప్రేయింగ్ ఆపరేషన్లు, సీజనల్ డిసీజ్ నివారణ అంశాల ను సమీక్షించారు.

క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య పనులను వేగంగా చేపట్టాలన్నారు.దోమల వృద్ధి నీ అరికట్టేందుకు డ్రై డే కార్యకలాపాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు.పౌర చైతన్యం, అవగాహన కార్యక్రమాలు చేపట్టి, వారి సహకారంతోదోమలు సహా కీటక జనిత వ్యాధులద్వారా సంక్రమించే వ్యాధులను నివారించాలని చెప్పారు.

## ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

## పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు

పెద్దపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్ర మైన ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు అన్నారు. గురువారం ఓదెల మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి నూతన పాలకవర్గాన్ని నియమించింది. పాలకవర్గ సభ్యులను ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించిన తదుపరి పాలకవర్గం సభ్యులను అభినందిస్తూ శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాకు ప్రసిద్ధి చెందిన ఓదెల మల్లన్న ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. ఆ లయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. పాలకవర్గ సభ్యులు సేవా భా వంతో పనిచేస్తూ ఆధ్యాత్మికత ను పెంపొందించేందుకు పాటుపడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులతో పాటు ఓదెల, సుల్తానాబాద్ మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ లీడర్లు, కార్యకర్తలు, జిల్లా పద్మశాలి సేవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఫార్మా సిటీ సర్వే

## అధికారులను అడ్డుకున్న రైతులు

యాచారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామం 2500ఎకరాల భూమి ఫార్మాసిటి కొరకు సర్వే చేస్తున్న అధికారులను నాలుగు గ్రామల రైతులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పార్మను రద్దు చేసి తిరిగి రైతుల భూములు రైతులకు ఇస్తానన్ని హామీ ఇచ్చి ఇప్పుడు మా భూముల్లో పోలీస్ బలగాలను తీసుకొచ్చి సర్వేలు ఏలా చేస్తారని కోర్టులో స్టే ఉంది. ఏలాంటి సర్వేలు చేయద్దంటూ ఆర్డీఓకు మేడిపల్లి, కుర్మిద్ద, నానాక్ నగర్, తాటిపర్తి గ్రామల రైతులు వినతి పత్రం అందజేసారు.

# కాంగ్రెస్ పార్టీలో బి ఆర్ ఎస్ మహిళా అధ్యక్షురాలు చేరిక.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** గురువారం రోజున వేములవాడ అర్బన్ మండలం బి ఆర్ ఎస్ మహిళా అధ్యక్షురాలు నాగారం కనకవ్వ వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో 50 మంది మహిళలతో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంది.

వారిని సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాది శ్రీనివాస్.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళా సోదరీమణులను నేను సాధారణంగా ఆహ్వానిస్తున్నానని అన్నారు. నేటి నుండి వారు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మరి బాగోగులు కాంగ్రెస్ పార్టీ చూసుకుంటుందని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అని సందర్భంగా మహిళా సోదరీమణులను కోరారు. కొత్త, పాత అనే తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు 20వేల కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. బీసీలకు

కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని మహిళా తల్లులు చెబుతున్నారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధి వర్గాల వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. గెలిచిన నాటినుండి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నమని పేర్కొన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు చేస్తున్నమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని తెలిపారు. ప్రజా సేవ చేయాలనుకున్నవారు కాంగ్రెస్ పార్టీలోకి రావాలని పిలుపునిచ్చరు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

# ఉద్యోగి ఉద్యోగ జీవితంలో పదవి విరమణ అనేది సహజం

### సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖకు వారందించిన సేవలు మారువలేనివి..

### పదవి విరమణ పొందిన అధికారులను ఘనంగా సత్కరించి,వీడ్కోలు

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 31(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/గురువారం నాడు పదవి విరమణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జిల్లా ఎస్పీ పదవి విరమణ పొందుతున్న అధికారులను ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అదనపు ఎస్పీ (అడ్మిన్) సంజీవ రావ్,సౌమ్యశీలి, అడ్మినిస్ట్రేషన్ లో క్రియాశీలకంగా విధులు నిర్వహిస్తూ వివిధ రకాల కార్యక్రమాలలో సహాయకారిగా ఉంటూ.. సలహాలు అంధించేవారు. ఆయన రెటైర్మెంట్ తీరని లోటు అన్నారు. సంజీవ రావ్ (1995) లో రాష్ట్ర పోలీసు శాఖలో సబ్-ఇన్స్పెక్టర్ గా నియామకమై, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో సహితం,ధైర్య సహాసాలతో విధులు నిర్వహించి,లా అండ్ ఆర్డర్ మెంటైన్ చేయడంలో, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ సమర్ధవంతంగా పని చేయడం జరిగిందని అన్నారు. ఇంటెలిజన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ.. కచ్చితత్వంతో కూడిన సమాచారాన్ని సేకరించి అధికారుల మన్ననలు పొందారని అన్నారు. వీరు అధించిన ఉత్తమ సేవలకు గాను తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడం జరిగిందని అన్నారు,యాదవ రెడ్డి ఎస్ఐ -(1983), అలీముద్దీన్ ఆర్ ఎస్ఐ (1983), అజీముద్దీన్ ఎ.ఎస్ఐ (1983) పోలీస్ కానిస్టేబుల్స్ గా జిల్లా పోలీసు శాఖలో నియామకమై గడిచిన 42 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో క్రైమ్ డ్యూటి, ఫింగర్ ప్రింట్ విభాగంలో, విఐపి పర్సనల్ సెక్యూరిటి అధికారిగా విధులు నిర్వహిస్తూ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో సైతం సమర్ధవంతంగా విధులను నిర్వహించడం జరిగిందని, తనకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా అంచలంచాలుగా పదోన్నతులు పొందుతూ సబ్-ఇన్స్పెక్టర్స్, అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్స్ గా పదోన్నతులు పొందడం వారి అందించిన సేవలకు నిదర్శనం అని అన్నారు,వారు పోలీసు శాఖకు అందించిన సేవలు మారువలేనివని వారి సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి వారికి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నాను అన్నారు. పోలీస్ శాఖ తరపున వారికి, వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందింస్తామన్నారు,ఈ కార్యక్రమంలో వర్టికల్ డిఎస్పీ శ్రీనివాస రావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఎఆర్ డియస్పీ నరేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ అశోక్, మోహనప్ప, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఐ లు రామారావ్, రాజశేఖర్, డానియెల్ మరియు రిటైర్డ్ అవుతున్న అధికారుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సింగూర్ ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతుంది

## ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 31 ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతి పెద్ద ప్రాజెక్టు అయిన సింగూరు ప్రాజెక్టుకు ఎగువ బాగాన కురుస్తున్నటువంటి వర్షాలకు, ప్రాజెక్టులోకి రోజురోజుకీ వరద ఉధృతం పెరుగుతుంది, తేదీ, 31.7.2025. సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 29. 927. టీఎంసీల కెపాసిటీ కాగా, ప్రస్తుతం,20.382. టీఎంసీలు నీరు నిల్వ ఉందని, మీటర్లలో గనక చూస్తే,523.600. మీటర్లు కాగా ప్రస్తుతం, 521.628. మీటర్ల, నీరు నిల్వ ఉంది, ప్రాజెక్టులోకి యావరేజ్ ఇన్ ఫ్లో, 2484, క్యూసెక్కులు కాగా యావరేజ్ అవుట్ ఫ్లో, 633, క్యూసెక్కులు కాగా, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై కి, 80, క్యూసెక్కులు, మిషన్ భగీరథకు70 , క్యూసెక్కులు, సింగూర్ లెఫ్ట్ కెనాల్ కు 60 క్యూసెక్కులు, తలెల్మా లిఫ్ట్ ఇరిగేషన్ కు 33, క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్టు అలాగే ఎవపోరేషన్ కింద, 390, క్యూసెక్కుల నీరు వెళ్తుందని సింగూరు ప్రాజెక్టు అధికారులు తెలియజేశారు....


# శ్రీ కాశీ విశ్వేశ్వర నామావళి పరమ శక్తిమంత్రం

## – డా ఎన్. అనంతలక్ష్మి



**హైదరాబాద్ జులై 31 ప్రజాబలం ప్రతినిధి:** బీందర్శన మాత్రం చేత, స్మరణ మాత్రం చేత మనల్ని కరుణించే దైవం శ్రీ కాశీవిశ్వేశ్వరుడని, ఆయన సహస్ర నామావళి ఆధ్యాత్మిక వేత్తలకు శక్తినీ ముక్తినీ ప్రసాదిస్తాయని 'విదుషీమణి' డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు.శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి 'సంఘమిత్ర' శ్రీమతి కె.హెచ్.ఎస్. జగదంబ రచించిన 'శ్రీ కాశీ విశ్వేశ్వర నామావళి' గ్రంథావిష్కరణ సభ మంగళవారం హైదరాబాద్ లోని శ్రీ పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా? అనంతలక్ష్మి 'శ్రీ కాశీ విశ్వేశ్వర నామావళి' గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ లయకారంలోనూ ప్రకాశించే అద్భుత శక్తి శ్రీ కాశీ విశ్వేశ్వరుడని, ఆయనను దర్శన మాత్రం చేత, స్మరణ మాత్రం చేసి ప్రసన్నం చేసుకోగలమని అన్నారు. శ్రీ కస్తూరి జగదంబ గారు లయబద్ధంగా, రాగయుక్తంగా పాడుకొనే రీతిన కూడా విశ్వేశ్వరుని సహస్ర నామావళిని రచించి అందించటం అభినందనీయమని అన్నారు.సభకు అధ్యక్షత వహించిన లయన్ డాఎం సుజాత రాజశేఖర్ మాట్లాడుతూ– ఎనభై వసంతాల వయస్సులో కూడా జగదంబ గారు భక్తితో, పారవశ్యంతో, అనుభూతి నొంది కాశీ విశ్వేశ్వర సహస్ర నామావళి నందించటం గొప్ప విషయమని అదొక అదృష్టమని అన్నారు.ఇంకా సభలో ప్రముఖ పాత్రికేయురాలు డాక్టర్ పేకేటి గీతాశివరాం, జీవిత భీమా వృత్తి నిపుణులు సూరి సీతారాం, ప్రముఖ పద్యకవి కళ్యాణ శ్రీ, కె. శ్యామలరావు, ఆధ్యాత్మిక కవి బండారుపల్లి రామచంద్రరావు, గ్రంథకర్త జగదంబ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా రచయిత్రి జగదంబను అతిథులు ఘనంగా సత్కరించారు. శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి రఘుశ్రీ సభా సమన్వయం గావించారు.

# రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి గా డా. వి. ఎస్. అలగు వర్షిని బాధ్యతలు





**హైదరాబాద్ జులై 31 ప్రజాబలం ప్రతినిధి:** బీరాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి గా డా. వి. ఎస్. అలగు వర్షిని బాధ్యతలు స్వీకరించారు...గురువారం సచివాలయంలో ని కార్యదర్శి పేశి లో లో బాధ్యతలను చేపట్టారు అంతకుముందు ఆమె చీఫ్ సెక్రటరీ కే. రామకృష్ణ రావు గారిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయల సొసైటీ కార్యదర్శి గా ఉన్న అలగు వర్షిని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి అండ్ కమిషనర్ గా బాధ్యతలను అప్పగించింది

# వైశ్య రాజకీయ రణభేరి గోడపత్రిక ఆవిష్కరణ



**రంగారెడ్డి జిల్లాప్రజాబలం ప్రతినిధి:** వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు మూడో తారీఖున జరిగే వైశ్య రాజకీయ రణభేరి ఆ"మేమెంతో మాకంతే" గోడపత్రిక ఆవిష్కరణలో పాల్గొన్న AVOPA రంగారెడ్డి జిల్లా 2 అధ్యక్షులు బొడ్డు శ్రీధర్.

వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త గారి ఆధ్వర్యంలో ఆగస్టు 3 ఆదివారం 2025 మధ్యాహ్నం మూడు గంటలకు జరగబోయేటువంటి వైశ్య రాజకీయ రణభేరి సభకు సంబంధించినటువంటి "మేమెంతో మాకంత" గోడపత్రిక ఈరోజు ఉదయం 11 గంటలకు బషీర్బాగులో గల ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి AVOPA బలపరచడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మలి పెద్ద శంకర్, హైదరాబాద్ AVOPA అధ్యక్షులు నమశ్శివాయ, రాష్ట్ర నాయకులు వీర బొమ్మ రమేష్ , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీధర్, మహిళా అధ్యక్షురాలు స్రవంతి మరియు వివిధ జిల్లా అధ్యక్షులు పాల్గొనడం జరిగింది.

మల్లిపెద్ది శంకర్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇన్ని రాజకీయ పార్టీలు వైశ్యులను రాజకీయంగా గుర్తించడంలో విఫలమయ్యారు అని పేర్కొన్నారు. బొడ్డు శ్రీధర్ మాట్లాడుతూ వైశ్య జాతి అంటేనే ప్రజలకు సేవ చేయడంలో ముందు ఉంటుంది, అలాంటి వైశ్యులను రాజకీయ పార్టీలు మరియు ప్రజలు రాజకీయంగా మద్దతు ప్రకటిస్తే ముందుకు వచ్చి మరింతగా ప్రజలకు సేవ చేయగలుగుతారు అని తెలియజేశారు, కాచం సత్యనారాయణ గుప్త గారు చేస్తున్నటువంటి ఈ బలమైన యజ్ఞంలో AVOPA రంగారెడ్డి జిల్లా నుంచి మేము పూర్తిగా మద్దతు ప్రకటిస్తూ మరియు వైశ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొంటామని తెలియజేయడం జరిగింది.



# విద్యార్థులకు న్యాణ్యమైన విద్యను అందించాలి. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.

## ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ముస్తాబాద్, ( ప్రజాబలం ),** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్స్, స్టోర్ రూమ్లను స్వయంగా తిరిగి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులచే హిందీ, ఇంగ్లీష్ పాఠాలను చదివించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. స్కూల్లోని విద్యార్థులతో కాసేపు ముచ్చటించువారు ఏమి తిన్నారు, ఎలా ఉంది ఫుడ్ అని అడిగి తెలుసుకుని, టేబుల్ టెన్నిస్ గేమ్స్ ఆడాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు వివరాలను స్వయంగా పరిశీలించి, అటెండెన్స్ వివరాలు తెలుసుకున్నారు.

# రాష్ట్రంలో మొట్టమొదటి మహిళా సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, గంభీరావుపేట, ( ప్రజాబలం ),** గురువారం రోజున రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని శ్రీ శిరిడి సాయిబాబా గ్రామైక్య మహిళా సంఘం వారికి ప్రభుత్వం తరపున జిల్లా అడ్మినిస్ట్రేషన్ ( కలెక్టర్) మంజూరు చేసిన పెట్రోల్ పంపును వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మరియు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డిలు కలిసి ప్రారంభోత్సవం చేసినారు. ఈ కార్యక్రమంలో గంభీరావుపేట మండల మహిళా సంఘ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా రాజన్న ఆలయ ఉద్యోగుల పదవీ విరమణ సమావేశం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సహాయక ఇంజనీర్ ( సివిల్) గా పని చేస్తున్న ఆర్. లక్ష్మణరావు మరియు లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నుండి బదిలీపై వేములవాడ రాజన్న ఆలయంలో పనిచేస్తున్న జి. లక్ష్మణ్ 31 జులై గురువారం రోజున పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాధాబాయి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు చిరు సత్కారం అందజేశారు. అనంతరం ఆలయ యూనియన్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి స్వామి వారి చిత్రపటం మరియు ప్రసాదం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో తో పాటు, రాజన్న ఆలయ యూనియన్ అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్, ఏ ఈ ఓ లు, ఈ ఈ, డి ఈ ఈ లు, ఏఈలు మరియు ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్...

## జిల్లా యస్.పి.పరితోష్ పంకజ్ ఐపియస్.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/**జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (ఆగస్ట్ 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్.పి. పరితోష్ పంకజ్ ఐపియస్.ఒక ప్రకటనలో తెలియజేశారు.కావున పోలీసుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించే, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు,అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ప్రభుత్వ విప్ ను కలిసిన వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులు.

## పలు సమస్యలపై వినతిపత్రం అందజేత.

## సానుకూలంగా స్పందించిన ఆది.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండా రవి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** వేములవాడ కోర్టులో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం రోజున అధ్యక్షులు గుండా రవి అధ్యక్షతన న్యాయవాదులు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండా రవి మాట్లాడుతూ వేములవాడ కోర్టు బిల్డింగ్ పైన మొదటి అంతస్తు నిర్మాణం పనులకు నిధులు మంజూరు కావడం జరిగిందని, దానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసే నిర్మాణం చేపట్టాలని, అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్ట్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంజూరు, కొనరావుపేట మండలానికి వేములవాడ కోర్టు పరిధిలో కలపాలని తదితర పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఇట్టి సమస్యలపై వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

అనంతరం శాలువాతో ప్రభుత్వ విప్ ను బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, న్యాయవాదులు గుజ్జే మనోహర్, కనికరపు శ్రీనివాస్, అనపర్తి రాజశేఖర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** వేములవాడ రూరల్ మండలం బొల్లారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు మమత మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందించడం సంతోషంగా ఉందని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దాతల సహకారంతో చేస్తున్న అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫిక్, మధు కవిత, మధు ప్రత్యూష, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌసియా, ఉపాధ్యాయురాలు మమత, బొల్లారం గ్రామం మాజీ సర్పంచ్ మల్లేశం, తడి గొప్పల గోవర్ధన్, బుర్ర పరశురాం, లక్కీ మల్లయ్య, ఈసంపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

మంథని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ పిలుపునిచ్చారు.గురువారం మంథని మున్సిపాలిటీ ఆవరణంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన మంథని పట్టణంలో ఆగస్టు 17న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభలను నిర్వహించబోతున్నామని అన్నారు. గత 30 సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి విజయాలను సాధించామని అన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించుకొని రాబోయే మూడు సంవత్సరాలకు భవిష్యత్ కార్యాచరణ ఈ మా సభలో రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభలకు పెద్దపల్లి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుండి కార్మిక వర్గం పెద్ద ఎత్తున మంథని కి తరలి రానున్నదని మంథనిలో భారీ ప్రదర్శన బహిరంగ సభ నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. మంథని పట్టణ ప్రజలు వ్యాపారులు శ్రేయోభిలాషులు మేధావులు ఇంకా అన్ని వర్గాల ప్రజానీకం ఈ పేద కార్మికుల మహాసభ నిర్వహణకు ఆర్థిక హార్దిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు గడిపల్లి మల్లేష్ ,చిప్పకుర్తి చందు, కోశాధికారి సింగారం గట్టయ్య, నాయకులు బెజ్జాల అనిల్, జంపయ్య, అశోక్, రాజేష్, భాగ్య, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో సి.సి కెమెరాల విఫలం



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 31 జూలై 2025**నేటి సమాజంలో రోడ్డు ప్రమాదాల వివరాలను పరిశీలించడం, దొంగతనలను పసిగట్టడం, నేర చరితులను కనిపెట్టడం వంటి కీలక పాత్ర పోషిస్తున్న సి.సి కెమెరాల పాత్ర చాలా కీలక మైనదని పోలీసు వ్యవస్థ ప్రజలతో పాటు మణికొండ మునిసిపల్ అధికారులకు తెలియ పరచడం ఇందుకు మాకు తెలిసిన సమాచారం మేరకు పోలీస్ అధికారుల సూచనల మేరకు దాదాపు ఒక కోటి ఇరువై లక్షలు వెచ్చించి మణికొండలో సి.సి కెమెరాలను బిగించడం జరిగినదనీ మునిసిపల్ అధికారీ కమిషనర్ కు తెలుపగా అట్టి విషయం తనకు తెలియదని అందుకు సంబంధించిన విషయాలు సేకరించి తగు విషయంలో చర్య తీసుకొంటానని తెలిపినారు. ఆ విషయంలో వాటిని ఒక సంవత్సరం పాటు పర్యవేక్షణ గావించడం తత్ పర్యంతం అట్టి సి.సి కెమెరాల పర్యవేక్షణ చేసే నాధుడు లేక ఎండకు ఎండి వానకు తడిసి గమ్మున ఎక్కడి వక్కడ పడి ఉండడం వలన స్థానిక నివాసి వేణుగోపాల్ గోల్డెన్ టెంపుల్ వద్ద వారి ఇద్దరు పిల్లలను పాఠశాలకు వదలడానికి వెళ్ళుచున్న సందర్భముగా ఆటో ద్వారా ప్రమాదం జరగడం, గాయాలపాలు కావడం మరియు మూడు రోజుల క్రితం సాఫ్టువేర్ ఉద్యోగినికి పైప్ లైన్ రోడ్డులో జరిగిన ప్రమాదం చేసిన కారకులను పసి కట్టడానికి స్థానిక పోలీసులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని కావున ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా సి.సి కెమెరాల పర్యవేక్షణ నిమిత్తం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని స్థానిక భారత రాష్ట్ర సమితి యువజన విభాగం అధ్యక్షుడు సంగం శ్రీకాంత్, స్థానిక నాయకులు అందే లక్ష్మణరావు, కందాడ ప్రవీణ్, తిరుపతి, కిరణ్, బాబురావు, వేణు గోపాల్ రెడ్డి తది తరులు తెలియ పరచారు.

# సంగుపేట నుండి జోగిపేట్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ వరకు పాదయాత్ర

## ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్

## పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 31 ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర వైద్య,ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, ఆధ్వర్యంలో ఏఐసీసీ, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి, మీనాక్షి నటరాజన్, పాదయాత్ర తేదీ,01,8,2025, నాడు సాయంత్రం ఐదు గంటలకు సగంపేట ఎక్స్ రోడ్ నుండి, జోగిపేట కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ వరకు, పాదయాత్ర చేయడం జరుగుతుంది, కావున మన పుల్కల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, సొసైటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనార్టీ సెల్ అధ్యక్షులు, సంఘాల నాయకులు, మధ్యాహ్నం మూడు గంటల నుండి బయలుదేరి, నాలుగు గంటల వరకు, సంగుపేట్ చౌరస్తా వద్దకు విచ్చేయగలరని కోరుకుంటున్న పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మీ మల్లన్న గారి దుర్గారెడ్డి.....

# భారతీయ యోగా సంస్థాన్ ప్రకాశలాల్ జికి నివాళులు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 31 జూలై 2025**మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కపూర్ నేతాజీ పార్క్ లో జీవించు జీవింపజేయు అనే నినాదంతో ప్రతి రోజు ఉదయం ఉచిత యోగా సాధన చేయిస్తామని యోగా టీచర్ బి.సుగుణ తెలిపారు. ఒక దీపం లక్షలాది జీవితాలకు వెలుగుని ప్రసాదిస్తూ వారి జీవితాల్లో ప్రకాశాన్ని నింపడమే యోగా సెంటర్ ముఖ్య ఉద్దేశమని హిత బోధ చేసిన సాధకుడు భారతీయ యోగా సంస్థాన్ వ్యవస్థాపకుడు దివంగత ప్రకాశలాల్ జి 16 వ వర్ధంతి నిర్వహించి నివాళులు అర్పించడం జరిగినది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు సద్గురు ప్రెసిడెంట్ మంజు అగర్వాల్ ముఖ్య అతిధిగా వచ్చి ప్రకాశలాల్ జికి నివాళులు అర్పించారు నూకరాజు, విజయసింహ, మహాజన్, ఉష తదితర యోగ సాధకలు పాల్గొని అయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి రోజు సంస్థ ఆధ్వర్యంలో నిస్వార్ధ సేవతో ముందుకు నడిపించడమే మేము ఆయనకు అర్పించే నిజమైన నివాళిగా భావిస్తున్నామని ముక్త కంఠంతో తెలియ జేసినారు. 4000 మందికి పైగా సాధాక్స్ తో భారతీయ యోగ సంస్థ ప్రస్తుతం సేవా భావంతో ఉచితంగా యోగ నేర్పబడు తున్నదని, ఇట్టి సదవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించు కోవాలనీ, యోగ ట్రైనర్ సుగుణ తెలిపారు. యోగా పరి పూర్ణ సాదకుడిగా నేర్చుకొని వారు కూడా సేవా భావంతో సంస్థ ఆశయాలను విజయ వంతంగా ముందుకు కొనసాగించాలని ఆమె తెలిపారు, దివంగత ప్రకాష్ లాల్ జీ యొక్క ఆశయ సాధనకు తోడుపడిన వారిమి అవుతామని ఈ సందర్భంగా తెలిపారు.

## సాయిబాబ ఆలయంలో తులసీదాస జయంతి వేడుకలు

తిరుపతి తిరుచానూరు రోడ్డు, శ్రీనివాస పురములోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయము నందు గురువారం శ్రీ గోస్వామి తులసీదాసు జయంతి సందర్భంగా 12 గంటలు పాటు జరిగే శ్రీ హనుమాన్ చాలీసా సామూహిక అఖండ పారాయణం భక్తులు, పారాయణ బృందాల సహకారంతో ఘనంగా జరిపినట్లు సాయి మందిర్ ఆలయ వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఏఎస్పి గంగరాజు, పారాయణ బృంద నిర్వాహకులు జూపుడి చిరంజివి రావు, రాజారెడ్డి, చెంగళ్ రాయల్ తెలిపారు. పార్వతీ పరమేశ్వరుల ప్రేరణతో శ్రీ రామచరిత మానస్ రచించిన శ్రీ తులసిదాసు గారు సుందరకాండతో సమానమైన ఫలితములనిచ్చు శ్రీ హనుమాన్ చాలీసాను శ్రీ హనుమాన్ స్వామిని ప్రత్యక్షంగా కీర్తించారని వారు తెలిపారు. అఖండ పారాయణలో సౌందర్యలహరి, సేవా కుటుంభము, గోవిందుడు అందరివాడే, సర్వస్తోత్రనిధి, శ్రీవారి సేవా గ్రూప్, అలిపిరి పాదాలు బృంద గ్రూపులు పాల్గొనగా, హనుమాన్ చాలీసా మహిళా మండలి, హనుమత్సేవా సమితి వాళ్ళు సహాయ సహకారాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానించి,జ్ఞాపికలు అంద చేసిన డిసిపి

## శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి

## మంచిర్యాల డిసిపి భాస్కర్ ఐపిఎస్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 31 :** పోలీస్ శాఖ నందు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను గురువారం రోజున రామగుండం పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి భాస్కర్ ఐపిఎస్ పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ముగ్గురు పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి శాలువా,పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈరోజు పదవీ విరమణ పొందిన అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు,1991 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి ఆర్ ఎస్ఐ గా ఎంపికై అంచలంచలుగా పదోన్నతి పొంది కుటుంబ సభ్యుల సహకారంతో ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా సంఘవిద్రవశక్తులతో పోరాడి యాంటి ఎక్స్టిస్ట్ ఆపరేషన్ నందు విధులను నిర్వర్తించి,ప్రస్తుత పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా కొనసాగడానికి కీలకపాత్రను పోషించి విజయవంతంగా పదవి విరమణ పొందడం జరిగింది.ఎన్.నరేష్ బాబు ఇన్స్పెక్టర్,1983 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా వచ్చి అంచలంచలుగా సర్వీసులోని 42 సంవత్సరముల 2 నెలలు విధులను నిర్వర్తించడం జరిగింది.జే సమ్మయ్య ఆర్ఎస్ఐ ఇన్స్పెక్టర్ 1984 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా వచ్చి అంచలంచలుగా సర్వీసులోని 41 సంవత్సరముల 6 నెలలు విధులను నిర్వర్తించడం జరిగింది.ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ... గతంలో పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితుల నందు సంఘవిద్రోహశక్తులతో పోరాడి కీలకంగా విధులను నిర్వర్తించి ప్రస్తుతం పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా ఉండడానికి గల కారణమైన అధికారులకు,సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు.పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు.తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు.ఎటువంటి అవసరం ఉన్న కమీషనరేట్ పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. పదవి విరమణ పొందిన అధికారులను ప్రభుత్వ వాహనంలో ఇంటి వరకు సాగనంపడం జరిగింది.ఈ కార్యక్రమంలో 13 బెటాలియన్ కమాండెంట్ మూర్తి,స్పెషల్ బ్రాంచ్ ఎసిపి మల్లారెడ్డి,ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్,ఎఆర్ ఎసిపి ప్రతాప్,ఏఓ శ్రీనివాస్,రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు దామోదర్,మల్లేషం, శ్రీనివాస్,వామన మూర్తి , సూపరింటెండెంట్ లు ఇంద్ర సేనా రెడ్డి,సంధ్య,మనోజ్ కుమార్,సిసి హరీష్, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లా కుంట పోచలింగం,స్వామి,పదవి విరమణ అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జులై 31 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల,జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 28వ తేదీన సౌత్ జోన్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు పోటీల్లో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల మరియు కళాశాల కి చెందిన విద్యార్థులు 12వ సౌత్ జోన్ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ జూనియర్ స్టేట్ లెవెల్ ఛాంపియన్షిప్ పోటీలకు నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు.గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సిఓ సేరు శ్రీధర్ శ్రీధర్ ప్రిన్సిపాల్ మంగ క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా ఆర్ శివ మాట్లాడుతూ...తమ పాఠశాలల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారిని వెలికి తీయాలని ఉద్దేశంతోనే తమ సొసైటీ ద్వారా క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వడంతోనే పలు పథకాలు సాధించడం జరుగుతుందన్నారు. క్రీడలతోపాటు విద్య పట్ల కూడా శ్రద్ధ చూపాలని క్రీడాకారులకు సూచించారు.ఆగస్టు 3 4 తేదీలలో హనుమకొండ జే ఎన్ ఎస్ మైదానంలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ తిరుమల్,పి డి,పి టి లు నాంపల్లి,రాజేష్ కళాశాల మరియు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# ప్రాథమిక పాఠశాలలో డైనింగ్ హాల్ కు భూమి పూజ చేసిన మాజీ వైస్ ఎంపీపీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** గురువారం రోజున ఫాజుల్ నగర్ లోని ఫాదర్ ప్రాథమిక విద్యాలయంలో విద్యార్థుల డైనింగ్ హాల్ కు భూమి పూజ చేసిన మాజీ వైస్ ఎంపీపీ జక్కుల కవిత - తిరుపతి. పాఠశాల విద్యార్థులకు భోజనాల్లో సమయంలో విద్యార్థులకు ఇబ్బంది ఉందని, డైనింగ్ హాల్ నిర్మాణం గురువారం రోజున చేపట్టడం జరిగింది. గ్రామ ఎంపీటీసీగా గెలిచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని సుమారు 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం, వేములవాడ మండల పరిషత్ నిధులతో 12 లక్షల రూపాయల అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ నిధుల నుండి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద మరియు ముదిరాజ్ సంఘం వద్ద రెండు బోరు బావులు వేయడం జరిగిందని, గ్రామ ప్రజలందరికీ సహకారం, తోటి మిత్రుల సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రానున్న రోజుల్లో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా జక్కుల తిరుపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం రైతుల అందోళన

నల్లగొండ జిల్లా పరిధిలోని తిప్పర్తి మండల కేంద్రంలో.. సాగునీటి కోసం రైతులు ఆందోళన చేపట్టారు. నార్కెట్ పల్లి - అద్దంకి హైవేపై కూర్చొని నినాదాలు చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి లక్షలాది క్యూసెక్కుల నీరు కిందకు విడుదల చేస్తున్నారని.. జిల్లాలోని ఏఎంఆర్పీ ఉదయ సముద్రం ప్రాజెక్టు పరిధిలో నీటిని విడుదల చేయడం లేదంటూ.. రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోరు బావుల కింద వరి నారు మల్లు పోసుకున్నామని.. పానగల్ లోని ఉదయ సముద్రం ప్రాజెక్టు కింద ఆ-40 కెనాల్ సహా మిగతా కెనాల్స్ కి పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న రైతులకు.. ఃఖీూ, అఖఓ నాయకులు మద్దతు పలికారు. పోలీసులు చేరుకుని.. రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా.. నార్కెట్ పల్లి -అద్దంకి హైవేపై కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# మంచి విద్యనందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

# -మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి



**నల్గొండ ప్రజాబలం ప్రతినిధి:** నల్గొండ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో 40 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, అందువల్ల విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో రెండు రోజుల్లో తాగునీటి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ,నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బాత్రూంలు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామని తెలిపారు. కేరళలో 99.9% అక్షరాస్యత ఉండగా, మన రాష్ట్రంలో 60 శాతం ఉందని , విద్య, నైపుణ్యాలు పెంపొందింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు, అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తున్నదని అన్నారు. నర్సింగ్ విద్యార్థులు చదువు పైన దృష్టి సారించాలని, సెల్ ఫోన్ జోలికి వెళ్ళవద్దని, ప్రజలకు మంచి సేవలు అందించాలని, సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నెల 4 న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కళాశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, ముఖ్యంగా 20 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించనున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 100 కోట్ల రూపాయలతో భవనాలు నిర్మించామని, ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎల్ఎల్ఎం, ఎం ఫార్మసీ, కోర్సులు,భవనాలు మంజూరు చేశారని ,2026-27 సంవత్సరంలో అడ్మిషన్లు సైతం ప్రారంభం కానున్నాయని, లా, ఫార్మసీకి మంచి డిమాండ్ ఉందని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో విద్యాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని అంతేకాక గత ప్రభుత్వం తొమ్మిది వేల కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు పెట్టినప్పటికీ గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెల 6000 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నప్పటికీ మంచి విద్యను అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ చాలా ఉత్తమమైనదని, వైద్యరంగంలో నర్సింగ్ అనేది మొదటి అదుగు అని అన్నారు. రోగులు ముందుగా స్టాఫ్ నర్స్ ని సంప్రదిస్తారని, డాక్టర్ కన్నా స్టాఫ్ నర్స్ ముఖ్యమని, రోగి ప్రాణాలు కాపాడటంలో స్టాఫ్ నర్స్ పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మెడికల్ టూరిజం లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అందువల్ల నర్సింగ్ విద్యార్థులు బాగా చదువుకోవాలని ,ప్రస్తుతం నిర్మించనున్న నర్సింగ్ కళాశాల భవనంలో స్టాఫ్ క్వార్టర్స్ ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని అన్ని విభాగాలలో అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే రూపొందించి సమర్పించాల్సిందిగా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

గురువారం ఆయన నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అభివృద్ధిపరిచిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు .అంతేకాక డయాలసిస్ కేంద్రానికి వచ్చిన నూతన వైద్య పరికరాలను పరిశీలించారు.

అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ లో ఆసుపత్రి వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ద్వారా ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించడంలో భాగంగా పోస్టుల భర్తీతో పాటు, ఎన్ఐసి, పిఐసి, ఆర్థోపెడిక్ తదితర అన్ని విభాగాలలో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని, అలాగే బ్లడ్ బ్యాంక్ కు అవసరమైన రిఫ్రిజిరేటర్ ఇతర సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఇందుకు కావలసిన సౌకర్యాలు,వైద్య పరికారాలపై స్పష్టంగా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. త్వరలోనే బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రసవం తర్వాత తల్లికి,బిడ్డకు పనికి వచ్చేలా ఎం సి హెచ్ కిట్లను అందించేందుకు అన్ని వస్తువులతో కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఫిజీషియన్, సర్జన్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.. ఆస్పత్రికి అవసరమైన ఇతర మౌలిక వసతులు, భవనాలు, సివిల్ పనులు,పోస్టులకు సైతం ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ కుమారి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎం హెచ్ ఓ వేణుగోపాల్ రెడ్డి ,ఆసుపత్రి వైద్యులు, తదితరులు ఈ సమక్షా సమావేశానికి హాజరయ్యారు .

## అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణకు ఆర్థిక సహాయం చేసిన మాజీ జడ్పిటిసి మధుకర్



**వికారాబాద్,నియోజకవర్గం ప్రతినిధి జూలై( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లామర్పల్లి మండల పరిధిలోని పట్లూరు గ్రామంలో ఈనెల మూడవ తేదీ ఆదివారం నాడు జరగబోయే నూతన అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణకు తన వంతు సహాయంగా 51000/- రూపాయలు ఆర్థిక సహాయం పట్లూర్ అంబేద్కర్ యువజన సంఘానికి అందించడం జరిగింది

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ మాజీ ఎంపిటిసి రవి మాజీ ఎంపీటీసీ అంజయ్య మాజీ ఎంపిటిసి రాజు నాయకులు రమేష్ మిత్ర రవీందర్ నర్సింలు తలారి రమేష్ ఎం రాజు వికాస్ నవీన్ నందు శ్రీహరి జీవన్ లాల్ కుమార్ మరియు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు

## పాదయాత్రతో కొత్త నాటకం : మెతుకు ఆనంద్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 31 ( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా వికారాబాద్ బి ఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్నాళ్లు ప్రజలను మోసం చేసి ఇప్పుడు జనహిత పాదయాత్ర నిర్వహించడంహాస్యాస్పదం.ఎందుకు ఈ పాదయాత్ర..స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మళ్ళీ మభ్యపెట్టి ఎలక్షన్లో లబ్ది పొందాలనె ప్రయత్నంలో భాగమే ఈ పాదయాత్ర.రాహుల్‌గాంధీ గారు తెలంగాణలో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకుని, ఆ సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైంది.ఓ వైపు

రుణమాఫీ, గిట్టుబాటు ధర మరియు రైతు భరోసాతో పాటు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు రాస్తారోకలు నిర్వహిస్తున్నారు.

రాహుల్ గాంధీని తీసుకొచ్చి, మాకు మాయ మాటలు చెప్పి మోసం చేసి ఓట్లు వేసుకున్నారని, ఇప్పుడు గాలికి వదిలేసారని నిరుద్యోగులు ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారు.రాష్ట్రంలో కల్తీ లేని ఆహారం కోసం విద్యార్థులు రోడ్ మీదకి వచ్చి పాదయాత్రలు చేస్తున్నారు.మంచినీటి కోసం మహిళలు రోడ్డు మీదకు వచ్చి కాళీ బిందాలతో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.ఇలా చెప్తూ పోతే ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు, రాష్ట్ర ఆడపడుచులు, వృద్ధులు, ఆటోడ్రైవర్లు, విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతి ఒక్కరూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి సమయంలో మీరు చేయాల్సింది పాదయాత్ర కాదు సరైన పాలన.ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చింది రాష్ట్రాన్ని సంక్షేమం మరియు అభివృద్ధి పథంలో నడిపించడానికి కానీ రేవంత్ రెడ్డి మీడియా సమావేశాల్లో బి.ఆర్.ఎస్,పార్టీ నేతలను సమాజం ఛీత్కరించే భాషతో మాట్లాడడం, మాట్లాడించడం తప్ప చేసిందేం లేదు. సీఎం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రజల నమ్మకాన్ని ఎప్పుడో కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీ కానీ, రేవంత్ రెడ్డి కానీ ప్రజల నమ్మకాన్ని గెలుచుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో దృష్టి పెట్టండి.ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన మిమ్మల్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తరిమి కొట్టి మీకు తగిన గుణపాఠాన్ని చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అనితెలిపారు

## ఏపీపీ ఫ్రీ ఆన్లైన్ గైడెన్స్ కు సంబందించిన పోస్టర్,బ్రోచర్ ల ఆవిష్కరణ

మంథని బార్ అసోషియేషన్ లో టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ యం.వరలక్ష్మి ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష కు హాజరు కానున్న యువ న్యాయవాదులకు ఫ్రీ ఆన్లైన్ గైడెన్స్ కు సంబందించిన పోస్టర్,బ్రోచర్ లను గురువారం ఆవిష్కరించారు. ఈ కోచింగ్ ను యువ న్యాయ వాదులు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంథని బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కెవిఎల్ఎన్ హరిబాబు,సింగరేణి సంస్థ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ సి.రమణ్ కుమార్ రెడ్డి,లీగల్ సెల్ జాయంట్ కన్వీనర్ బండ మాధురి,న్యాయ వాదులు డి.విజయ్ కుమార్, ఆర్ల నాగరాజు,శశిభూషణ్ కాచె, షభానా,వ్యాస్ కుమార్ పాల్గొన్నారు,

## రాజన్నను దర్శించుకున్న జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజన్న సన్నిధిలోకి రాగానే ఆలయ అర్చకులు, వేద పండితులు ఎస్పీకి వేదమంత్రాలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ కళ్యాణమండపంలో అర్చకులు వేదొక్త ఆశీర్వచనం అందించారు.

ఆలయ పర్యవేక్షకులు జి.శ్రీనివాస్ శర్మ, స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని ఎస్పీకి అందజేశారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభిమానం చాటుకున్న ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం పల్లి మత్త గ్రామానికి చెందిన నాయిని నరహరి - లావణ్య దంపతులు గత కొన్ని సంవత్సరాలుగా సొంత ఇల్లు లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో తమకి ఇల్లు మంజూరు అయిందని, చాలా సంవత్సరాల ఎదురుచూపుల తర్వాత సొంత ఇంటి కల నెరవేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఇల్లు నిర్మాణ దశలో ఉండి ప్రస్తుతం ఇల్లు కడప పెట్టుకుంటున్న సందర్భంగా పూజా కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటంతో కడప పూజ కార్యక్రమంలో పెట్టుకొని అభిమానాన్ని చాటుకున్నారు.

ప్రజా ప్రభుత్వంలో తమకు అన్ని రకాల పథకాలు అందుతున్నాయని అ దంపతులకు సంతోషం వ్యక్తం చేశారు.

## తల్లిని పట్టించుకోని కుమారుని పై కేసు నమోదు.

## తంగళ్ళపల్లి మండలంలో మానవత్వాన్ని మరిచిన కన్న కొడుకు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, తంగళ్ళపల్లి, ( ప్రజాబలం ),** తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో మానవత్వాన్ని మరిచిన ఘటన వెలుగులోకి వచ్చింది. బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలసాని ఎల్లవ్వ(85) అనే వృద్ధురాలు తన కుమారుడు బాలసాని నారాయణ పై తంగళ్ళపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఫిర్యాదులోని వివరాల ప్రకారం తనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, నాలుగు సంవత్సరాల క్రితం తన కుమారుడు నారాయణ తన వద్ద ఉన్న ఆస్తి మొత్తం తన పేరు పై రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని తెలిపింది. ఆస్తి మొత్తం తీసుకున్న తర్వాత తిండి పెట్టకుండా, తన ఆరోగ్యం బాగా లేకపోయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆమె వాపోయింది. నారాయణతో పాటు ఆయన భార్య పద్మ కూడా ఇదే విధంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆమె తెలిపింది. ఈ మేరకు రుద్ద తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తంగళ్ళపల్లి ఎస్సై ఉపేందర్ చారి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.

## కాంగ్రెస్ నాయకులు ఎస్. వినోద్ కుమార్ కి ఘోర రోడ్ ప్రమాదం...

## ఎలాంటి ప్రాణాపాయం లేకుండా క్షేమంగా బయటపడ్డారు







**మహబూబ్‌నగర్ ప్రజాబలం ప్రతినిధి:** బుధవారం 30/7/2025 నాడు గద్వాల జిల్లా కోర్టులో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై బి. ఆర్.ఎస్. పార్టీ పెట్టిన అక్రమ కేసుపై వాదించుటకు గద్వాల జిల్లా కోర్టుకు వెళ్లి అనంతరం గద్వాల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంజిపేట లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తిగా ఉన్నారని తెలియగానే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తో పాటు గంజిపేట లక్ష్మణ్ ఇంటికి వెళ్లి మాట్లాడి పార్టీని వదిలి వెళ్లొద్దని ఒప్పించి, సాయంత్రం తిరుగుప్రాయణంలో మహబూబ్ నగర్ వస్తుండగా కనిమెట్ట గ్రామం దగ్గర ఒక పెద్ద కంటైనర్ లారీ వచ్చి వినోద్ కుమార్ ఇన్నోవా క్రిస్ట కారును ఢీకొట్టడం జరిగింది. ఈ యొక్క ఘోర రోడ్డు ప్రమాదంలో మన ప్రియతమా నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మరియు సీనియర్ న్యాయవాది ఎస్.వినోద్ కుమార్ భగవంతుని దయవల్ల ఎలాంటి ప్రాణాపాయం లేకుండా క్షేమంగా బయటపడ్డారు...

## రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**వికారాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.

గురువారం మినీ వీడియో కాన్ఫరెన్సు హాలు నందు హౌసింగ్ అధికారులతో వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీ ల పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించిన పనులు పురోగతి లో ఉండాలని అన్నారు. అర్హుడైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ప్రభుత్వ ఉద్దేశమని , జీవితంలో సొంత ఇల్లు ఉంటె సమాజంలో వారికీ ఒక గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా అన్నారు.. జిల్లా లో ఇప్పటివరకు 11,785 మంజూరు అయ్యాయని, 5,778 గ్రౌన్డింగ్ అయ్యాయని ,882 ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నారని తెలిపారు. గతం లో ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి ఇండ్లు మంజూరు అయిన వారికీ బిల్లు తీసుకున్న లబ్దిదారులకు రెండవ సారి అవకాశము లేదని అన్నారు. స్లాబు లేవల్ వరకు జరుగుతున్న పనులు త్వరగా పనులు పూర్తి చేయాలి.ఇప్పటివరకు అయినంత వరకు బిల్లులు జమ అయ్యా యని .వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులలో వేగం పెంచాలని మున్సిపల్ సిబ్బంది ఆదేశించారు. ఇందిరమ్మ నిర్మా ణ పనులు త్వరగా జరిగేలా చొరవ చూపాలని సంబంధిత అధికారులను కోరారు.




అనంతరము పి డి హౌసింగ్ అధికారి పదవి విరమణ పొందుతున్న సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయము తో ఎన్ని సమస్యలు ఉన్న హౌసింగ్ స్కీం ప్రోగ్రాం ను ముందుకు తీసుకు వెళ్లడం జరిగిందని, ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తే జీవితంలో ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని, ఉద్యోగ బాధ్యతలో భాగంగా మన సర్వీసులో నిబద్ధతతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందడం పదవీ విరమణ సమయంలో ఎంతో సంతోషాన్ని ఇ స్తుందని, పదవి విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ కలెక్టర్ ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. పదవి విరమణ అనంతరం తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపాలని, అదేవిధంగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆసక్తి ఉన్న కార్యక్రమాలలో ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు. వారికీ శాలువాలతో సన్మానం చేసి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి,పి డి హౌసింగ్ కృష్ణయ్య, ముక్రం బాబా, డి ఇ సయ్యద్ సాజిద్ , తాండూర్ మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక స్వావలంబనకు మహిళలకు ప్రోత్సాహం

### అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

## మహిళల ఆర్థిక అభివృద్ధికి వీ హబ్ ద్వారా శిక్షణ




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 31:** రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అందరూ మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి రాధికా గుప్తా సూచించారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీ హబ్, డి ఆర్ డి ఎ ఆధ్వర్యంలో ఎస్ హెచ్ జి మహిళలు, మహిళా పరిశ్రమలవేత్తలకు ఆర్ ఏ ఎం పి, ప్రోగ్రాం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 35% సబ్సిడీతో రుణాల సహాయంతోపాటు వివిధ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చాయని, మార్కెటింగ్, రుణాల సంబంధిత సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించనున్నారని తెలిపారు. ఎంపికైన మహిళలకు బిజినెస్ నైపుణ్యాలు, ప్రొడక్ట్ డెవలప్మెంట్, మార్కెటింగ్ పై శిక్షణ అందించనున్నట్లు వివరించారు.

వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడుతూ వరల్డ్ బ్యాంక్, కేంద్ర ఎం ఎస్ ఎం ఇ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 2 సంవత్సరాల పాటు కొనసాగుతుందని, మహిళా ఎం ఎస్ ఎం ఇ లకు ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు.

వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ మాట్లాడుతూ టెక్స్టైల్, ఫుడ్ మాన్యుఫాక్చరింగ్, హస్తకళలు తదితర రంగాల్లోని మహిళలకు శిక్షణ, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, మెంటరింగ్ వంటి అంశాల్లో సహకారం అందించనున్నట్లు చెప్పారు. అనంతరం సభ్యుల దరఖాస్తులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సాంబశివరావు, మెప్మ పీడీ విజయలక్ష్మి, వీ హబ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సాయిరామ్, మహిళ సంఘాల నాయకులు అజయలక్ష్మి, డి ఆర్ పి డి.ఎస్. అమర్‌సింగ్ తదితర అధికారులు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం లక్ష్యాలను పూర్తిగా సాధించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 31 :** భవిష్యత్తు తరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో గీత కార్మికుల సంక్షేమంలో భాగంగా 400 తాటి మొక్కలు నాటడంతో పాటు గీత కార్మికులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు సహజ సిద్ధమైన, సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే లక్ష్యాలను కేటాయించడం జరిగిందని తెలిపారు.ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని,ప్రజలు తమ ఇండ్లలో మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు. మండలంలోని పొక్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా 200 మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల పరిధిలో కూరగాయల మొక్కలను అభివృద్ధి చేసి తాజా కూరగాయలు పొందేందుకు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ను ప్రారంభించారు. పాఠశాలలోని వంటశాల, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత,హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన,పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వివిధ సబ్జెకులలో పలు ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో చదవాలని,ఉన్నత స్థానాలలో నిలువాలని అన్నారు.గ్రామంలో ఆరోగ్య ఉ ప కేంద్రం ఏర్పాటులో భాగంగా అనువైన ప్రదేశం కొరకు స్థల పరిశీలన చేశారు. పల్లెదవాఖానా ఆయుష్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు.వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. మండలంలోని అంగ్రాజ్పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, సమయానుసారంగా చేసుకోవలసిన పరీక్షలు, తీసుకోవలసిన మందులు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని,వ్యాక్సినేషన్ కొరకు దూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేదని, ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలోని తహశిల్దార్ కార్యాలయాన్ని తహశిల్దార్ మల్లిఖార్జున్తో కలిసి సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని,వివిధ రకాల ధృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మిషన్ భగీరథతో పాటు అమృత్ 2.0 ద్వారా ప్రజలందరికీ నిరంతరం త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం.. టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

### ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రతి పథకాన్ని అమలు చేస్తుంది, ఇచ్చిన మాట కాంగ్రెస్ పార్టీ తప్పదు...



**కూకట్పల్లి (ప్రజబలం)జులై 31:** ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ బొమ్మ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జనహిత పాదయాత్ర కార్యక్రమానికి పరిగి నియోజకవర్గం రంగాపూర్ గ్రామం నుండి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఈ పాదయాత్రలో పాల్గొని సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సన్నదం చేయడానికి, కాంగ్రెస్ కేడర్లో ఉత్సాహంతో పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు అవకాశం ఉందని దానిని పరిష్కారించేందుకు శ్రమదానం ఉపయోగపడుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు, మాజీ శాసన సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంస్థ చైర్మన్లు, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, సప్పిడి భాస్కర్, రఘుపతి రెడ్డి, కుమార్ యాదవ్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com